aruhi
aruhi group
MAHAA PRABHA NEWS
Delivering truth with integrity – the voice of the people."
Email : info@mahaaprabha.com
www.mahaaprabha.com - 9160600610
VINTAARA INSTITUTE OF TECHNOLOGY
Build Your Dream Career
ADMISSION OPEN
HYDERABAD & VIJAYAWADA & VISAKHAPATNAM & GUNTUR

నమస్తే
# మహాప్రభ
ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ
బుధవారం
19-08-2026 సంపుటి : 01 సంచిక :148 పేజీలు : 08 వెల :₹ 5/-
తెలుగు దినపత్రిక

BESQATI
www.besqati.com
besqati.com
Contact : info@besqati.com

Published From RANGAREDDY,TELANGANA.తెలంగాణ mahaaprabha.com NAMASTEY MAHAAPRABHA RNI NO : TGTEL/26/A0738 info@mahaaprabha.com

## ఉరిశిక్షకు బదులు విషపు ఇంజెక్షన్!



- ఉరిశిక్షకు ప్రత్యామ్నాయంగా ప్రాణాంతక ఇంజెక్షన్ డిమాండ్
- మరణశిక్ష అమలు పద్ధతి మార్చాలన్న పిటిషన్ కొట్టివేత
- ప్రత్యామ్నాయ పద్ధతులపై సమగ్ర సమీక్షకు అవకాశం
- ఖైదీ గౌరవం, అనవసర బాధ తగ్గింపే రాజ్యాంగ లక్ష్యం
- 2017 నాటి పిటిషన్‌పై సుప్రీంకోర్టు తీర్పు

03

## మెటాకు కేంద్రం వార్నింగ్




- పిల్లలపై లైంగిక కంటెంట్ విషయంలో మెటాకు కేంద్రం హెచ్చరిక
- చట్టాలను ఉల్లంఘిస్తే సేఫ్ హార్బర్ ప్రొటెక్షన్ ఉండదు..
- సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలన్నింటికీ ఒకే నిబంధనలు వర్తింపు
- భారత భాషలు, సంస్కృతికి అనుగుణంగా కంటెంట్ మోడరేషన్‌కు సూచన
- ఏఐ కంటెంట్‌కు లేబులింగ్ తప్పనిసరి చేయాలని కేంద్రం ఆదేశం

03



## సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన

- 20 నుంచి 30 వరకు ఖరారైన షెడ్యూల్
- 10 రోజుల పాటు యూకే, అమెరికాలో సీఎం పర్యటన
- మొదట లండన్ సందర్శన అనంతరం అమెరికాకు ప్రయాణం
- ఆయా దేశాల్లోని వర్సిటీల సందర్శన

హైదరాబాద్ ఆగస్టు 18: మహాప్రభ

సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా, బ్రిటన్ పర్యటన షెడ్యూల్ ఖరారయ్యింది. ఈనెల 20 నుంచి 30 వరకు యూకే, అమెరికాలో సీఎం పర్యటించనున్నారు. ఇవాళ రాత్రికి దిల్లీకి వెళ్లనున్నారు. అక్కడ జరగనున్న సీడబ్ల్యూసీ సమావేశంలో సీఎం పాల్గొంటారు. రేపు రాత్రి దిల్లీ నుంచి లండన్‌కు బయలుదేరనున్నారు. ఎల్లుండి రాత్రి 12.30 గంటలకు విమానం ఎక్కుతారు. ఈ నేపథ్యంలో సీఎం రెండు దేశాల్లో ఉన్న పలు వర్సిటీలను సందర్శించనున్నారు. అలాగే అక్కడి వర్సిటీ బృందాలతో సమావేశం కానున్నారు. లండన్‌లో పర్యటన అనంతరం రేవంత్‌రెడ్డి అమెరికాకు వెళ్తారు.

సీఎం లండన్ షెడ్యూల్ ఇదే :

ఆగస్టు 21న లండన్‌లోని ఆక్స్‌ఫర్డ్ వర్సిటీలోని బ్లావట్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌ను సీఎం సందర్శించనున్నారు. అక్కడి ఎమిరేట్స్

-మిగతా 3 లో

సామాజిక న్యాయం అందించిన తొలి ప్రభుత్వం

# మాదే


**సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం**

- అమరవీరుల స్థూపానికి ఉన్న ప్రాధాన్యతే పాపన్న గౌడ్ విగ్రహానికి ఉండాలి
- సర్దార్ సర్వాయి పాపన్నమన అందరికీ స్ఫూర్తి ప్రదాత
- నిమ్న వర్గాలని ప్రోత్సహించేలా కాంగ్రెస్ ప్రభుత్వం
- మళ్లీ పాత దొరలు గద్దెనెక్కేందుకు కాచుకుని కూర్చున్నారు
- ఎట్టి పరిస్థితుల్లోనూ వారికి అవకాశం ఇవ్వొద్దు
- బీఆర్‌ఎస్‌పై విమర్శలు గుప్పించిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ ఆగస్టు 18: మహాప్రభ

తెలంగాణ చరిత్రలోనే బీసీల జనాభా లెక్కలు తేల్చి సామాజిక న్యాయం అందించిన తొలి ప్రభుత్వం తమదేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. అర్హులైన నేత, గీత కార్మికులకు పెన్షన్లు ఇవ్వాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ప్రజాపాలనను కాపాడుకోవాలని, మళ్లీ పాత దొరలు గద్దెనెక్కేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వొద్దని పిలుపునిచ్చారు. హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని మంత్రులు, గౌడ సంఘాల నేతల సమక్షంలో సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు.

-మిగతా 3 లో



మహాప్రభ నేటి మాట
ప్రతిరోజూ ఒక మాట... సమాజం కోసం ఒక ఆలోచన...

## నీటి కోసం ఎదురుచూసే గ్రామం

నీటి కోసం ఎదురుచూసే గ్రామం

ఆ గ్రామంలో వేసవి మొదలైంది. బావులు ఎండిపోయాయి. చెరువు అడుగంటింది.

ప్రతి ఉదయం మహిళలు ఖాళీ బిందెలతో కిలోమీటర్ల దూరం నడిచి నీటి కోసం వెళ్లేవారు.

ఒకరోజు ఓ చిన్న బాలుడు తన తండ్రిని అడిగాడు:

"నాన్నా... మన ఊరికి రోడ్డు వచ్చింది, కరెంట్ వచ్చింది... మరి నీళ్లు ఎప్పుడు వస్తాయి?"

తండ్రి మౌనంగా తలదించుకున్నాడు.

కొద్దిసేపటి తర్వాత బాలుడు అన్నాడు:

"నీళ్లు లేకపోతే మన ఊరికి భవిష్యత్తు ఎలా వస్తుంది?"

ఆ మాట గ్రామ పెద్దలను ఆలోచింపజేసింది. అందరూ కలిసి చెరువును శుభ్రం చేసి, వర్షపు నీటిని నిల్వ చేసే పనులు ప్రారంభించారు.

:- నీరు ప్రకృతి ఇచ్చిన వరం మాత్రమే కాదు... భవిష్యత్ తరాల హక్కు. దాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత.

- పుల్లం అఖిల్ రెడ్డి
మహాప్రభ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్

## ఇమ్రాన్ ఖాన్‌ను ఆస్పత్రిలో చేర్చండి

03



## బీజేపీ జేబుసంస్థగా కేంద్ర ఎన్నికల సంఘం

- ఇష్టం వచ్చినట్లుగా ఓట్లు తొలగించడం అన్యాయం
- 22శాతం ఓట్ల తొలగింపు దుర్మార్గపు చర్య
- తెలంగాణలో సర్ ప్రక్రియను పొడిగించాలి
- పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్ డిమాండ్

హైదరాబాద్, ఆగస్టు 18: మహాప్రభ

2014లో కొలువుదీరిన నాటి నుంచి రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుందంటూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. ఎన్నికల కమిషన్ కూడా బీజేపీకి అనుబంధ సంస్థగా మారిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం సీబీఐ, ఈడీ తరహాలో ఎన్నికల సంఘాన్ని కూడా తనకు అనుకూలంగా మార్చుకుందని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు.తెలంగాణలో ఎస్ఐఆర్‌కు ఇంకా సమయం ఇవ్వాలని ఈసీని డిమాండ్ చేశారు. అర్హులైన అందరికీ ఓటు

-మిగతా 3 లో

## ఈవీల వాహన కాలం ఐదేండ్లు పొడిగింపు!



03

## తప్పు ఒప్పుకుని సరిదిద్దుతున్నాం

**24 గంటల్లో 34 రిజిస్ట్రేషన్లు చేశాం**

- 22ఏ నిషేధిత జాబితాపై ప్రజలు ఆందోళన చెందొద్దు
- 15 రోజులపాటు రోజువారీగా దరఖాస్తుల పరిశీలన
- ధరణి తప్పులకు హరీశ్‌రావు సమాధానం చెప్తారా?
- ఏలేటి ఆరోపణలకు ఆధారాలుంటే చూపాలి
- రెవెన్యూ మంత్రి పొంగులేటి

హైదరాబాద్ ఆగస్టు 18: మహాప్రభ

ఇందిరమ్మ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ పేదవాడికి అన్యాయం చేయబోదనీ. పేదవాడి న్యాయబద్ధమైన భూమిలో ఒక్క అంగుళం కూడా ఈ ప్రభుత్వం తీసుకోదనీ, వారి హక్కులు, ఆస్తులకు సంపూర్ణ రక్షణ కల్పిస్తామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో తన కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో మంత్రి మాట్లాడారు. 22ఏ నిషేధిత జాబితా వల్ల ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. తప్పును ఒప్పుకుని సరిదిద్దుతున్నామని వివరించారు. ఇప్పటికే ప్రక్రియ ప్రారంభమైందనీ, 24 గంటల్లోనే మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో 30, రంగారెడ్డి జిల్లాలో నాలుగు మొత్తం 34 రిజిస్ట్రేషన్లు జరిగాయని వివరించారు.

-మిగతా 3 లో





## దేశంలో 14 మంది సీఎంలపై క్రిమినల్ కేసులు..

- 89 కేసులతో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అగ్రస్థానంలో
- సువేందు అధికారి రెండో స్థానం.. డీకే, చంద్రబాబుకు చెరో 19 కేసులు
- ప్రస్తుత, మాజీ ఎంపీలు-ఎమ్మెల్యేలపై 4,192 కేసులు పెండింగ్
- యూపీలోనే అత్యధికంగా 1,171 క్రిమినల్ కేసులు నమోదు
- తెలంగాణకు చెందిన 17 మంది ఎంపీల్లో 11 మందిపై కేసులు
- రాజ్యసభ సభ్యుల్లో 75 ని మందిపై క్రిమినల్ కేసులు
- ప్రత్యేక కోర్టుల ఏర్పాటు, హైకోర్టుల పర్యవేక్షణ కోరిన హన్సారియా

న్యూఢిల్లీ, ఆగస్టు 18: మహాప్రభ

దేశంలోని 28 రాష్ట్రాల్లో 14 మంది సీఎంలపై క్రిమినల్ కేసులున్నాయి. అత్యధిక కేసులున్నది మాత్రం తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపైనే. దేశంలోని సీఎంలు, ఎంపీలు, ఎమ్మెల్యేలు సహా ప్రజా ప్రతినిధులపై ఉన్న క్రిమినల్ కేసులు, వారిపై తీసుకునే చర్యలపై అమికస్ క్యూరీ, సీనియర్ న్యాయవాది విజయ్ హన్సారీ రూపొందించిన 96 పేజీల నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. వారిపై చర్యలు తీసుకునే

-మిగతా 3 లో



## పొంగులేటి వెంటనే రాజీనామా చేయాలి

- నిషేధిత జాబితా భూములకు నైతిక బాధ్యత వహించాలి
- సారీలు చెప్పి సరిపుచ్చుకోవడం కుదరదు
- బాధితుల కోసం జనతా గ్యారేజ్ తెరిచే ఉంటుంది
- బిఆర్ఎస్ నేత హరీస్ రావు డిమాండ్

హైదరాబాద్, ఆగస్టు 18: మహాప్రభ

మీ భూములను 22ఏ నిషేధిత జాబితా నుంచి విడిపించే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని మాజీ మంత్రి, పార్టీ సీనియర్ నేత హరీశ్‌రావు ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల ప్రజలు రిజిస్ట్రార్ ఆఫీస్ చుట్టూ.. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొందని మండిపడ్డారు. పొంగులేటి నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. న్యాయబద్ధంగా, కష్టార్జితంతో సంపాదించిన భూములు నిషేధిత జాబితాలో ఉంటే ఫోన్ చేయాలంటూ ప్రభుత్వం టోల్ ఫ్రీ నెంబర్ ఇచ్చిందని, అయితే ఆ టోల్ ఫ్రీ నెంబర్ పనిచేయడం లేదని హరీశ్‌రావు చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన టోల్ ఫ్రీ నంబర్ పని చేయకపోయినా మా జనతా గ్యారేజ్

-మిగతా 3 లో

# దేశమంతా నాగుల పంచమి..

### -ఆ గ్రామంలో మాత్రం తేళ్ల పంచమి..!




**ఆగస్టు 18: మహాప్రభ**

సోమవారం నాడు దేశమంతా నాగుల పంచమి జరుపుకొంటే ఆ గ్రామంలో మాత్రం తేళ్ల పంచమి జరుపుకున్నారు. నాగుల పంచమి రోజున తేళ్ల పంచమి జరుపుకోవడం అక్కడ ఆనవాయితీగా వస్తున్నది. నారాయణపేట జిల్లా సరిహద్దుల్లో కర్ణాటక రాష్ట్రం లోని యాద్గిర్ జిల్లాలోగల గురుమిట్కల్ మండలం కందుకూరులో ఈ సంప్రదాయం కొనసాగుతున్నది. ఇక్కడ తేళ్లను దైవస్వరూపంగా భావిస్తూ ఏటా ప్రత్యేకంగా తేళ్ల జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది.కందుకూరు గ్రామ సమీపంలోని కొండపై ఉన్న కొండమవ్వ దేవాలయంలో అమ్మవారిని దర్శించుకొని, అక్కడే ఉన్న తేళ్ల విగ్రహాలకు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం కొండపై ఆలయ పరిసరాల్లోని ఏ చిన్న రాయిని తొలగించినా వాటి కింద తేళ్లు కనిపించాయి. తేళ్లను చేతితో తాకినా, పట్టుకున్నా అవి కుట్టకపోవడం అమ్మవారి దివ్యానుగ్రహమని భక్తులు విశ్వసిస్తారు. చిన్నారులు, యువత, మహిళలు, పురుషులు అనే తేడా లేకుండా భక్తులు తేళ్లను చేతుల్లోకి తీసుకుని, చేతులు, పొట్ట, ముఖం తదితర శరీర భాగాలపై పెట్టుకుని జాతరలో సందడి చేశారు. గుట్టపై ఉండే వాతావరణ పరిస్థితులు, వన మూలికల కారణంగా తేళ్లు కుట్టలేకపోతున్నాయని కొందరు విద్యావంతులు చెబుతున్నారు.

# నేను కూడా దిమాగీ నక్సలైట్‌నే

### ప్రధాని మోదీ వ్యాఖ్యలపై కేజ్రీవాల్ కామెంట్



**న్యూఢిల్లీ ఆగస్టు 18: మహాప్రభ**

ప్రశ్నించే వారంతా దిమాగీ నక్సల్స్ అంటూ తాజాగా ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. ఇప్పటికే చిదంబరం తదితరులు ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. తాజాగా అరవింద్ కేజ్రీవాల్ కూడా మోదీ వ్యాఖ్యలకు ఘాటుగానే స్పందించారు. స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా దిమాగీ నక్సల్స్ అంటూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై దుమారం రేగుతూనే ఉంది. మోదీ వ్యాఖ్యలపై స్పందించిన ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజీవ్రాల్.. తను దిమాగీ నక్సల్ అయినందుకు గర్వపడుతున్నానని చెప్పారు. తను నిజమైన దేశభక్తుడినని.. బీజేపీకి భయపడేవాడిని కాదని అన్నారు. 80వ స్వాతంత్య్ర వేడుకల్లో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదం అయిన విషయం తెలిసిందే. దేశంలో ఆయుధాలు పట్టి అడవుల్లో ఉండే నక్సల్స్ ను అంతం చేశామని.. దిమాగీ నక్సల్స్ హింసను ప్రేరేపించేందుకు ఎదురు చూస్తున్నారని.. సమాజాన్ని తప్పుడు దోవ పట్టించేందుకు సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ల్గ÷ర్యంగా ప్రశ్నించే వారు దిమాగీ నక్సల్స్.. ఎవరైతే బీజేపీకి భయపడకుండా ప్రశ్నిస్తారో వాళ్లంతా మోదీ దృష్టిలో దిమాగీ నక్సల్స్. ఒకవేళ భగత్ సింగ్ , అంబేద్కర్ ఇప్పటికీ బతికే ఉంటే.. వాళ్లను కూడా ప్రధాని మోదీ.. దిమాగీ నక్సల్స్ అనేవారేమోనని మండిపడ్డారు. జవాబుదారీ వ్యవస్థ, అవినీతి లేని సమాజం, ప్రజలకు సౌకర్యాలు, హాస్పిటల్స్ స్కూల్స్, , డ్రైనేజీ సిస్టమ్ మొదలైన వాటిపై ప్రశ్నించే వారు మోదీ దృష్టిలో దిమాగీ నక్సల్సేనా అని ప్రశ్నించారు. నేను నిజమైన దేశ భక్తుడిని అందుకే నేను దిమాగీ నక్సల్.. అంటూ చెప్పుకొచ్చారు.

## 20 గంటలు పని..

# ఉదయాన్నే ఫాలోఅప్

### -తమిళనాడులో విజయ్ శత దినోత్సవ పాలన

### -'రాజకీయ యోగి'గా వర్ణించిన సహచరుడు



**చెన్నై, ఆగస్టు 18: మహాప్రభ**

నటుడి నుంచి రాజకీయ నేతగా మారి అనూహ్యంగా తమిళనాడు ముఖ్యమంత్రిగా అయిన జోసెఫ్ విజయ్ 100 రోజుల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. ఆయన శత దినోత్సవ పాలన ఎలా ఉందో అయన సన్నిహిత సహచరుడు, మంత్రి ఆధవ్ అర్జున మీడియాతో పంచుకున్నారు. విజయ్ రోజుకు 18-20 గంటలు అవిశ్రాంతంగా పనిచేస్తున్నారని, ఉదయం నాలుగు గంటలకే మంత్రులకు ఫోన్ చేసి సంబంధిత శాఖల పురోగతి తెలుసుకుంటున్నారని వెల్లడించారు. అలాంటి ముఖ్యమంత్రి ఉండటం తమ అదృష్టమని పేర్కొన్నారు. ఎన్నికల్లో తనకు ప్రజలు ఇచ్చిన విజయంతోనే ఆయన సంతృపి ?తపడిపోకుండా ఏ శాఖలో ఏ సమస్యలు ఉన్నాయి? వాటిని తీర్చడానికి ఏం చేయాలి? అన్న అంశాలపై ఎక్కువగా దృష్టి సారిస్తున్నారన్నారు.తమలో ఎంతమాత్రం అహంకారం లేదని, తాము ప్రజలకు సేవ చేయాలని మాత్రమే అనుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల విజయోత్సవాన్ని జరుపుకోవాలని ఎంతమాత్రం అనుకోని విజయ్‌ను ఒక 'రాజకీయ యోగి'గా అభివర్ణించారు. ఆర్థిక లీకేజీలు అరికట్టడానికి, పాలనలో పారదర్శకతకు ఆయన కృషి చేస్తున్నారన్నారు. అలాగే అవినీతి కింది స్థాయి నుంచి పేరుకుపోయి ఉన్న విషయాన్ని ఆయన గుర్తించారని, దానిని తొలగించడానికి ప్రయత్నాలు ప్రారంభించారని తెలిపారు.

# ఆగస్టు 28 నుంచి ఫ్రీడం ఆఫ్ రిలీజియన్ యాక్ట్..

### మతమార్పిడులు నిరోధించేందుకేనన్న ప్రభుత్వం



**ఆగస్టు 18: మహాప్రభ**

బలవంతపు మత మార్పిడులను అడ్డుకునేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం కొత్త చట్టాన్ని అమలు చేయనుంది. 'ద మహారాష్ట్ర ఫ్రీడం ఆఫ్ రిలీజియన్ యాక్ట్, 2026' పేరుతో రూపొందిన ఈ చట్టం ఆగస్టు 28 నుంచి అమలులోకి రానుంది. రాష్ట్ర వ్యాప్తంగా అమలు కానున్న ఈ చట్టంపై ప్రభుత్వం అధికారిక గెజిట్ విడుదల చేసింది. ఈ చట్టం గురించి ప్రభుత్వం చెబుతున్న వివరాల ప్రకారం రాష్ట్రంలో బలవంతపు మత మార్పిడులను ఈ చట్టంతో నిరోధించవచ్చు. ఒక వ్యక్తిని బలవంతంగా మతం మార్చడానికి ప్రయత్నించడం, లేదా అబద్ధపు హామీతో వేరే మతంలోకి మారేలా చేయడం, మతం మార్చే విషయంలో బలవంత పెట్టడం, అనుచితంగా ప్రవర్తించడం వంటివి ఈ కొత్త చట్ట ప్రకారం తీవ్రమైన నేరాలు.ఈ నేరానికిగాను గరిష్టంగా 7 సంవత్సరాల వరకు జైలు శిక్ష విధిస్తారు. గరిష్టంగా రూ.5 లక్షల జరిమానా కూడా విధిస్తారు. ఇందులో సాధారణ వ్యక్తుల్ని బలవంతంగా మతం మార్చితే రూ.1 లక్ష జరిమానా ఉంటుంది. అదే, మైనర్ లేదా మానసిక రుగ్మతలు ఉన్నవారిని, ఎస్సీ, ఎస్టీలను మతం మార్చితే మాత్రం రూ.5 లక్షల వరకు జరిమానా, జైలు శిక్ష ఉంటుంది. అలాగే, ఇది నాన్ బెయిలబుల్ కేసుగా పరిగణిస్తారు. ఈ బిల్లును మహారాష్ట్ర అసెంబ్లీ ఇటీవలే అమోదించింది. అయితే, ఈ బిల్లును పలు సంస్థలు, సంఘాలు వ్యతిరేకించాయి. ఈ చట్టం తేవడమంటే ప్రజల వ్యక్తిగత స్వేచ్ఛ విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకోవడమే అని విమర్శించాయి. కానీ, ఈ విమర్శల్ని మహారాష్ట్రలోని కూటమి ప్రభుత్వం తిప్పికొట్టింది. బలవంతంగా మతం మార్చడాన్ని, ప్రేమ, పెళ్లి పేరుతో మతం మార్చేందుకు ప్రయత్నించడాన్ని, మోస పూరితంగా మతం మార్చడాన్ని నియంత్రించేందుకే ఈ చట్టం తెచ్చామని ప్రభుత్వం చెప్పింది. ఈ చట్టం ప్రకారం ఎవరైనా తమ ఇష్టానుసారం మతం మారాలి అనుకుంటే ఇందుకోసం సంబంధిత వ్యవస్థ వద్ద దరఖాస్తు చేసుకోవాలి. అది కూడా 60 రోజుల ముందుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ చట్టంలో కీలమైంది పిల్లలకు తల్లి మతం వర్తించడం. వేరే మతం వ్యక్తిని పెళ్లి చేసుకుని, ఇంకో మతంలోకి మారితే.. పుట్టే పిల్లలకు తల్లి మతమే వర్తిస్తుంది. చట్ట వ్యతిరేకంగా, చట్టంతో సంబంధం లేకుండా ఎవరైనా వేరే మతంలోకి మారినప్పుడు వారి పిల్లలకు ఈ రూల్ వర్తిస్తుంది. ఇది పెళ్లైన వారికి లేదా రిలేషన్‌లో ఉన్న వారికి కూడా. ఈ చట్టం అన్ని మతాల వారికి సమానంగా వర్తిస్తుంది.

# ఉరిశిక్షను రద్దు చేయండి

### -ఇతర సులువైన మరణాలను ప్రసాదించండి

### -సుప్రీంలో దాఖలైన పిటిషన్ కొట్టివేత



**న్యూఢిల్లీ, ఆగస్టు 18: మహాప్రభ**

మరణశిక్ష పడిన దోషులను ఉరిశిక్ష నుంచి తప్పించి, సులువుగా మరణించే ప్రక్రియను చేపట్టాలని కోరుతూ దాఖలైన పిల్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. భారతీయ శిక్షా స్మృతిలో భాగంగా కొన్ని కేసుల్లో ఉరి తీస్తున్న విషయం తెలిసిందే. అయితే ఉరి వేసి దోషిని చంపే ప్రయత్నాలను ఆపేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిల్ దాఖలైంది. ఉరికి బదులుగా, మరేదైనా నొప్పిలేని విధానాన్ని అమలు చేయాలని కోరుతూ దాఖలైన పిల్‌ను సుప్రీంకోర్టు కొట్టిపారేసింది. జస్టిస్ విక్రమ్ నాథ్, సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును ఇచ్చింది. కాలం చెల్లిన ఉరి విధానాన్ని బహిష్కరించి, దాని స్థానంలో నొప్పి లేకుండా మరణశిక్షను అమలు చేసే విధానాన్ని ప్రవేశపెట్టాలని కోరుతూ సుప్రీంలో పిటీషన్ దాఖలైంది. అయితే ఆ పిటీషన్‌ను అత్యున్నత న్యాయస్థానం తిరస్కరించింది. ఇక ఈ కేసులో ఇదే తుది తీర్పు కాదని, భవిష్యత్తులో ఈ అంశాన్ని మళ్లీ ప్రస్తావించవచ్చు అని, ఒకవేళ ప్రత్యామ్నాయ మరణాలపై ఏవైనా శాస్త్రీయ ఆధారాలు ఉంటే, దాని ప్రకారం మరణశిక్షను అమలు చేయవచ్చని కోర్టు తన తీర్పులో అభిప్రాయపడింది. ప్రస్తుతం రిట్ పిటీషన్‌ను డిస్మిస్ చేస్తున్నామని, కానీ భవిష్యత్తులో రాజ్యాంగం ధర్మాసనం ఈ విధానంపై సమీక్ష నిర్వహించే అవకాశం ఉంటుందని కోర్టు తెలిపింది. శాస్త్రీయ విధానాల్లో మరణశిక్షను అమలు చేసే అంశంలో కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని స్వేచ్ఛగా తీసుకోవచ్చని కోర్టు అభిప్రాయపడింది. సీనియర్ న్యాయవాది రిషి మల్హోత్రా 2017లో ఈ పిల్ దాఖలు చేశారు. సీఆర్పీసీలోని సెక్షన్ 354(5) కింద ఉరి ద్వారా మరణశిక్షను అమలు చేసే వారు. అయితే ఆ సెక్షన్‌ను సవాల్ చేస్తూ కోర్టులో పిటీషన్ వేశారు. మరణశిక్ష అమలులో భాగంగా ఉరికి బదులుగా ప్రాణాంతక ఇంజెక్షన్ ఇవ్వాలని పిటీషనర్ అభిప్రాయపడ్డారు. అనేక దేశాలు ఉరి తీయడానికి బదులుగా ప్రత్యామ్నాయ రీతిలో మరణశిక్షలను అమలు చేస్తున్నాయన్నారు. మరణశిక్ష అమలు రీతిలపై ప్రభుత్వం ఉన్నత స్థాయిలో చర్చిస్తున్నట్లు అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి తెలిపారు. విషపూరిత ఇంజెక్షన్ ద్వారా మరణశిక్ష అమలు చేసే విధానం విజయవంతంగా జరగడంలేదని సీనియర్ న్యాయవాది మీనాక్షి ఆరోరా వాదించారు. ఈ అంశంలో కమిటీని ఏర్పాటు చేయాలని ఆ న్యాయవాది కోరారు.

## టిస్' స్నాతకోత్సవానికి

# సీజేఐ స్థానంలో మరొకరు



**ముంబై ఆగస్టు 18: మహాప్రభ**

ఈ నెల 22న జరగనున్న టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్(టిస్) 86వ స్నాతకోత్సవానికి టాటా మెమోరియల్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ సీఎస్ ప్రమేష్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్టు ఆ సంస్థ ప్రకటించింది. అంతకు మందు ఆగస్టు 2న నిర్వహించ తలపెట్టిన స్నాతకోత్సవానికి భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ ముఖ్య అతిథిగా హాజరు కావాల్సి ఉంది.అయితే సీజేఐ వస్తే విద్యార్థుల నుంచి నిరసనలు తలెత్తవచ్చనే భావనతో వర్సిటీ అధికారులు స్నాతకోత్సవాన్ని వాయిదా వేశారు. కాగా ఆగస్టు 22న జరిగే స్నాతకోత్సవానికి జస్టిస్ సూర్యకాంత్ హాజరు కాలేరని, నవంబర్ వరకు ఆయన షెడ్యూల్ బిజీగా ఉందని సీజేఐ కార్యాలయం తెలిపి

# మహాత్ముడిపైనా కేసులు పెట్టండి

### -బీజేపీకి ఖర్గే సవాల్




**న్యూఢిల్లీ, ఆగస్టు 18: మహాప్రభ**

న్యూఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో, ఆ తర్వాత గోవాలో జరిగిన పార్టీ కార్యక్రమంలోనూ వందేమాతరం గేయాలాపనకు సంబంధించి వివాదాలు కొనసాగుతున్న తరుణంలో పార్టీ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై దాఖలైన ఫిర్యాదులోని ప్రాతిపదికను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మంగళవారం ప్రశ్నించారు.జాతీయ గేయాన్ని దాని పూర్వ రూపంలో పాడటం నేరమైతే మహాత్మా గాంధీతోపాటు మాజీ ప్రధానులు జవహర్‌లాల్ నెహ్రూ, అటల్ బిహారీ వాజ్‌పేయిలపై కూడా ఫిర్యాదులు నమోదు చేయాలని ఆయన సవాలు విసిరారు. శనివారం పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో జాతీయ గేయాన్ని పూర్తి స్థాయిలో ఆలపించడాన్ని ఆపాలని కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ సంకేతాలు ఇచ్చారని ఆరోపిస్తూ బీజేపీ ఆమెపై ఆరోపణలు చేసిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి.

# హర్మూజ్ జలసంధి అమెరికాలో భాగం..

### ఫొటో రిలీజ్ చేసిన డొనాల్డ్ ట్రంప్





**న్యూఢిల్లీ, ఆగస్టు 18: మహాప్రభ**

హర్మూజ్ జలసంధి పై పూర్తి నియంత్రణ తమకే ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఈ క్రమంలోనే తాజాగా 'ట్రూత్ సోషల్ వేదికగా కీలక పోస్టు పెట్టారు. 'హర్మూజ్.. అమెరికా కొత్త ప్రదేశం' అని ఆ జలసంధి మ్యాప్‌పై రాసి ఉన్న ఫొటోను ఆయన షేర్ చేశారు. ప్రస్తుతం హర్మూజ్‌ను దిగ్బంధనం చేసిన అమెరికా.. ఇరాన్ నౌకలను అడ్డుకుంటున్నది.మరోవైపు.. తమ డిమాండ్లు నెరవేర్చే వరకు హర్మూజ్‌పై పట్టును కొనసాగిస్తామని ఇరాన్ పార్లమెంటరీ స్పీకర్ మహమ్మద్ బాఘేర్ గాలిబాఫ్ మంగళవారం స్పష్టంచేశారు. 'ఒప్పందం ప్రకారం దిగ్బంధనాన్ని ఎత్తేయాలి. స్తంభింపజేసిన ఆస్తులను విడుదల చేయాలి. చమురుపై ఆంక్షలను తొలగించాలి. అదేవిధంగా సైనిక చర్యలకు ముగింపు పలకాలి. అప్పటివరకు హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవబోం' అని స్పష్టంచేశారు. కాగా ప్రస్తుతం ఇరాన్‌తో చర్చలు, సంప్రదింపులేవీ జరగడం లేదని ట్రంప్ స్పష్టంచేశారు. ఇరాన్ నౌకల విషయంలో దిగ్బంధనం పూర్తిస్థాయిలో కొనసాగుతోందని తెలిపారు. హర్మూజ్ జలసంధి తెరిచే ఉందని చెప్పారు. సముద్ర జలాల్లో ఇరాన్ అమర్చిన పేలుడు పదార్థాలను తొలగించామని, కొన్నింటిని పేల్చివేశామని 'ట్రూత్ సోషల్' వేదికగా ట్రంప్ ప్రకటించారు.

## ఉరిశిక్షకు బదులు విషపు ఇంజెక్షన్!


**o ఉరిశిక్షకు ప్రత్యామ్నాయంగా ప్రాణాంతక ఇంజెక్షన్ డిమాండ్**
**o మరణశిక్ష అమలు పద్ధతి మార్చాలన్న పిటిషన్ కొట్టివేత**
**o ప్రత్యామ్నాయ పద్ధతులపై సమగ్ర సమీక్షకు అవకాశం**
**o ఖైదీ గౌరవం, అనవసర బాధ తగ్గింపే రాజ్యాంగ లక్ష్యం**
**o 2017 నాటి పిటిషన్‌పై సుప్రీంకోర్టు తీర్పు**



న్యూఢిల్లీ,
మరణశిక్షను ఎదుర్కొంటున్న ఖైదీలను ఉరి తీసే ప్రస్తుత పద్ధతిని రద్దు చేసి, దాని స్థానంలో ప్రాణాంతక ఇంజెక్షన్ ఇవ్వడం వంటి తక్కువ బాధాకరమైన పద్ధతులను ప్రవేశపెట్టాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు మంగళవారం కొట్టివేసింది. అయితే ఒక నిపుణుల కమిటీ ద్వారా ప్రస్తుతం ఉన్న మరణశిక్ష అమలు పద్ధతిపై సమగ్ర సమీక్ష చేపట్టకుండా తమ తీర్పు కేంద్ర ప్రభుత్వాన్ని అడ్డుకోలేదని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం పేర్కొందిమరణశిక్షను ఎదుర్కొంటున్న ఖైదీ గౌరవాన్ని కాపాడుతూనే అనవసరమైన బాధను తగ్గించడమనే రాజ్యాంగ లక్ష్యాన్ని ఏదైనా ప్రత్యామ్నాయ పద్ధతి మెరుగ్గా నెరవేరుస్తుందేమో అటువంటి సమీక్ష ద్వారా పరిశీలించవచ్చని కోర్టు తెలిపింది. ఉరి తీసే పద్ధతిని చట్టం నుంచి తొలగించాలని కోరుతూ సీనియర్ న్యాయవాది రిషి మల్హోత్రా 2017లో దాఖలు చేసిన పిటిషన్‌పై ధర్మాసనం తన తీర్పును వెలువరించింది

## మెటాకు కేంద్రం వార్నింగ్

**o పిల్లలపై లైంగిక కంటెంట్ విషయంలో మెటాకు కేంద్రం హెచ్చరిక**
**o చట్టాలను ఉల్లంఘిస్తే సేఫ్ హార్బర్ ప్రొటెక్షన్ ఉండదు..**
**o సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలన్నింటికీ ఒకే నిబంధనలు వర్తింపు**
**o భారత భాషలు, సంస్కృతికి అనుగుణంగా కంటెంట్ మోడరేషన్‌కు సూచన**
**o ఏఐ కంటెంట్‌కు లేబులింగ్ తప్పనిసరి చేయాలని కేంద్రం ఆదేశం**




న్యూఢిల్లీ:
పిల్లలపై అభ్యంతరకర, లైంగిక వీడియోలు (సీఎస్ఏఎం) విషయంలో నిబంధనలు ఉల్లంఘిస్తే మెటాకు సేఫ్ హార్బర్ ప్రొటెక్షన్ ఉండదని కేంద్రం హెచ్చరించింది. ఈ విషయంలో ఎవరికైనా ఇదే రూల్ వర్తిస్తుందని స్పష్టం చేసింది. సీఎస్ఏఎం అంశాన్ని మెటా తీవ్రంగా పరిగణిస్తుందని, తన ప్లాట్‌ఫాంలపై అక్రమ, చట్టవ్యతిరేక కంటెంట్‌ను నియంత్రించడానికి కృషి చేస్తుందని ప్రభుత్వం తెలిపింది. అలాగే, ఇండియాలోని భిన్న భాషలు, సంస్కృతికి అనుగుణంగా కంటెంట్ మోడరేషన్ చేయాలని మెటాకు సూచించింది.మెటా ప్లాట్‌ఫాంలపై కంటెంట్‌ను అభివృద్ధి చేయడం, పిల్లలపై లైంగిక వేధింపులకు సంబంధించిన కంటెంట్‌ను నియంత్రించడంపై కేంద్రానికి, మెటాకు మధ్య చర్చలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫున మెటాకు పలు సూచనలు అందాయి. సీఎస్ఏఎం కంటెంట్‌ను అరికట్టే విషయంలో మెటా బాధ్యతగా వ్యవహరిస్తున్నట్లు కేంద్రం గుర్తించింది. చట్ట వ్యతిరేక, అభ్యంతరకర కంటెంట్‌ను గుర్తించడానికి మెటా మరిన్ని జాగ్రత్తలు తీసుకోనుంది. ఒకవేళ సీఎస్ఏఎం విషయంలో నిబంధనలు ఉల్లంఘిస్తే వారికి అరెస్టు నుంచి రక్షణ కల్పించే సేఫ్ హార్బర్ ప్రొటెక్షన్ కోల్పోతారు. దేశంలోని చట్టాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటుంది కేంద్రం. అంతర్జాతీయ ప్రమాణాల్ని ఇండియాలో తగ్గించాల్సిన అవసరం లేదు. అలాగే, భాష, సాంస్కృతికపరమైన సున్నితమైన అంశాలకు అనుగుణంగా సోషల్ మీడియా సంస్థలు తమ వ్యవస్థల్ని మార్చుకోవాలి. కేంద్రం ఈ అంశాల్ని మెటా, వాట్సాప్ వంటి వాటికి పరిమితం చేయడం లేదు. అన్ని సోషల్ మీడియా, మెసేజింగ్ యాప్‌లకు వర్తించేలా చూస్తుంది. ఇటీవల వాట్సాప్ తీసుకురావాలని భావించిన యూజర్ నేమ్ విషయంలో కూడా కేంద్రం కఠినంగానే వ్యవహరించింది. వాట్సాప్ చేపట్టనున్న ఇతర అప్‌డేట్లపై కూడా కేంద్రం దృష్టి సారించింది. సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలలో వస్తున్న ఏఐ కంటెంట్‌పై కూడా కేంద్రం ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ కంటెంట్ ఏఐతో రూపొందించిందా లేదా తెలుసుకునేందుకు వీలుగా ఆ ఫొటోలు, వీడియోలపై లేబుల్ ఉండేలా చూడాలని ఆదేశించింది.

## సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన

మొదటి తరువాయి

స్టేడియంలో ఫుట్‌బాల్ ప్రజెంటేషన్‌లో సీఎం పాల్గొననున్నారు. ఆగస్టు 22న లండన్‌లో కేంబ్రిడ్జ్ బృందంతో సీఎం సమావేశం కానున్నారు. ఆరోజు ఉదయం 11.30 గంటలకు యూనివర్సిటీ ఆఫ్ లండన్ క్యాంపస్‌లోని సెనెట్ హౌస్‌ను సందర్శిస్తారు. ఆ తర్వాత సాయంత్రం 4 గంటలకు లండన్ బిజినెస్ స్కూల్కు వెళ్తారు. ఆగస్టు 23న లండన్ నుంచి అమెరికాలోని బోస్టన్‌కు బయలుదేరతారు.
అమెరికా సీఎం సందర్శించే ప్రదేశాలు :
ఆగస్టు 24న బోస్టన్లో ఉదయం 10.30 గంటలకు హార్వర్డ్ యూనివర్సిటీ క్యాంపస్‌ను సందర్శిస్తారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు ఎంఐటీ క్యాంపస్‌కు వెళ్తారు. ఆగస్టు 25న ఉదయం 10.30 గంటలకు బోస్టన్లో నార్త్ ఈస్టర్న్ క్యాంపస్‌ను సందర్శిస్తారు. ఆరోజు సాయంత్రం 4 గంటలకు వర్జీనియా టెక్ యూనివర్సిటీ బృందంతో సమావేశం అవుతారు. అలా రాత్రి 7 గంటలకు బోస్టన్ నుంచి న్యూయార్క్ సిటీకి సీఎం పయనమవుతారు. ఆగస్టు 26న న్యూయార్క్‌లో రాత్రి 7 గంటలకు ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ నిర్వహించే మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో పాల్గొంటారు. ఆ తర్వాత ఆగస్టు 29న

## ఈవీల వాహన కాలం ఐదేండ్లు పొడిగింపు!

**-ముసాయిదా జారీ చేసిన కేంద్రం**



న్యూఢిల్లీ:
బ్యాటరీ, హైడ్రోజన్ ఇంధన, సహజ వాయువుతో నడిచే వాహనాల జీవిత కాలాన్ని ఐదేండ్ల పాటు పొడిగించాలని కేంద్రం ప్రతిపాదించింది. సెంట్రల్ మోటార్ వెహికల్ రూల్స్ 1989, సవరణల ముసాయిదాను రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంగళవారం జారీ చేసింది. ఈ నెల 10న ప్రచురించిన ప్రతిపాదిత నిబంధనల్లో మార్పుల్లో భాగంగా వీటిపై సలహాలు, సూచనలను 30 రోజుల్లో తెలియజేయాలంటూ కోరింది. అయితే అధికారికంగా తుది గెజిట్ ప్రచురితమైన తర్వాతే ఈ నిబంధనలు అమల్లోకి వస్తాయని ప్రకటించింది.గరిష్ట జీవిత కాలపరిమితి ఎంతో పేర్కొనపోయినప్పటికీ పైన పేర్కొన్న వాహనాల జీవిత కాలాన్ని ఇప్పుడున్న దానికి ఐదేండ్ల పాటు పొడిగిస్తారు. మల్టీ యాక్సిల్ సరకు రవాణా వాహనం 15 ఏండ్లు, ఇతర వాహనాలు 12 ఏండ్లు పూర్తిచేస్తే వాటిని మార్చకుండా వాటి జీవిత కాలాన్ని మరో ఐదేండ్లు పొడిగించుకోవచ్చు. అయితే దీని నిమిత్తం వాహన యజమాని నేషనల్ పర్మిట్ ఖాతాకు ప్రతి ఏటా రూ.16,500 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. జాతీయ పర్మిట్‌ల ప్రక్రియను మరింత డిజిటలీకరించాలని కేంద్రం భావిస్తున్నది.

## పొంగులేటి వెంటనే రాజీనామా చేయాలి

మొదటి తరువాయి

అంటే తెలంగాణ భవన్ తలుపులు మీకోసం ఎప్పుడూ తెరిచే ఉంటాయని హరీశ్‌రావు అన్నారు. మూసిపరివాహక ప్రాంతంలోని ఇండ్లను హైడ్రా కూలగొట్టే ప్రయత్నం చేసినప్పుడు జనతా గ్యారేజ్ తలుపు తట్టారని, అప్పుడు వాళ్లకు న్యాయం చేశామని అన్నారు. అదేవిధంగా నిషేధిత జాబితాలో ఉన్న ఇళ్ల విషయంలో కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి తుగ్లక్ నిర్ణయాలతో రాష్ట్ర పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని వ్యాఖ్యానించారు. రాత్రికి రాత్రే కాలనీల్లో ప్రభుత్వం అమ్మిన భూములు, హెచ్ఎండీఏ అమ్మిన భూములను కూడా నిషేధిత జాబితాలో పెట్టారని మండిపడ్డారు. 'మీరు చేసిన తప్పులకి ప్రజలకు ఎందుకు శిక్ష అని అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలు నా చేతిలోకి రావాలని ఈ నిర్ణయం తీసుకున్నారు. అధికారులు తప్పు చేశారు.. సారీ అని పొంగులేటి చెప్తే సరిపోతుందా? ఇది 30 శాతం గవర్నమెంట్... ఏ పని కావాలన్నా 30శాతం కమిషన్ అడుగుతున్నారని అంటూ విరుచుకుపడ్డారు.

## ఇమ్రాన్ ఖాన్‌ను ఆస్పత్రిలో చేర్చండి

**-ప్రత్యేక వైద్య బోర్డుతో వైద్య పరీక్షలు జరిపించండి**
**-వారానికోసారి కుటుంబీకులు కలిసేందుకు అనుమతించండి**
**-పాకిస్తాన్ ప్రభుత్వానికి అక్కడి సుప్రీంకోర్టు ఆదేశం**



ఇస్లామాబాద్:
జైల్లో ఉన్న పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యంపై ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఆయనను ఆస్పత్రికి తరలించాలని ఆ దేశ ప్రభుత్వాన్ని పాకిస్తాన్ సుప్రీంకోర్టు మంగళవారం ఆదేశించింది. ప్రత్యేక వైద్య బోర్డుతో పరీక్షలు చేయించడంతో పాటు కుటుంబ సభ్యులను వారానికి ఒకసారి కలిసేందుకు అనుమతించాలని కూడా ఆదేశించింది. రావల్పిండిలోని అదియాలా జైలులో ఉన్న 73 ఏళ్ల ఇమ్రాన్ ఖాన్‌ను ఇస్లామాబాద్‌లోని షిఫా ఇంటర్నేషనల్ హాస్పిటల్‌కు తరలించి సమగ్ర వైద్య పరీక్షలు, అవసరమైన చికిత్స అందించాలని ముగ్గురు సభ్యుల ధర్మాసనం ఆదేశించింది. కోర్టు ఆదేశాల ప్రకారం ఆయనను 48 గంటల్లోగా ఆస్పత్రికి తరలించాల్సి ఉంది. ఇమ్రాన్ ఖాన్‌కు కొంతకాలంగా కంటి సమస్యతో బాధపడుతున్నారు. ముఖ్యంగా కుడి కంటికి సంబంధించిన సెంట్రల్ రెటీనల్ వీన్ ఆక్లూషన్ సమస్య కారణంగా ఆయన చూపు గణనీయంగా దెబ్బతిన్నట్లు ఆయన కుటుంబ సభ్యులు, వైద్యులు ఆందోళన వ్యక్తం చేశారు. జైలు అధికారులు మాత్రం ఇటీవల ఆయన చూపు దాదాపు సాధారణ స్థితికి వచ్చింది అని కోర్టుకు నివేదిక ఇచ్చారు. అదే సమయంలో వైద్య రికార్డుల్లో బీపీ మార్పులు, గుండెదడ, తలనొప్పి, ఆందోళన, అసహనం వంటి సమస్యలు కూడా నమోదైనట్లు సమాచారం.
ప్రత్యేక మెడికల్ బోర్డు
ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్య పరిస్థితిని సమగ్రంగా పరిశీలించేందుకు వైద్య నిపుణులతో మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఇందులో ఆయన వ్యక్తిగత వైద్యుడు కూడా ఉండేలా కోర్టు సూచించింది. ఆయన కుమారులు ఖాసిమ్, సులేమాన్ చాలా కాలంగా తండ్రిని కలవలేకపోతున్నారని కుటుంబం ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో ఆయనను కలిసేందుకు అవకాశం కల్పించాలని ఇచ్చిన ఈ ఆదేశం ప్రాధాన్యం సంతరించుకుంది.

## సామాజిక న్యాయం అందించిన తొలి ప్రభుత్వం మాదే

మొదటి తరువాయి



గౌడ, యాదవ, ముదిరాజ్, దళిత వర్గాలను ప్రోత్సహించేలా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఏ ఒక్క కులానికో, మతానికో పరిమితం కాలేదని, బహుజనులను ఏకతాటిపైకి తెచ్చి గోల్కొండ కోటపై జెండా ఎగురవేశారని రేవంత్ రెడ్డి తెలిపారు.
కాంగ్రెస్ ప్రభుత్వంలో సామాజిక న్యాయం :
లకులవృత్తులను గౌరవిస్తూనే పిల్లలను ఎట్టి పరిస్థితుల్లోనూ చదివించాలని తల్లిదండ్రులను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కుటుంబ న్యాయం మాత్రమే జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వంలో సామాజిక న్యాయం చేస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. నేత, గీత కార్మికులకు పెన్షన్లు ఇవ్వాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామని సీఎం తెలిపారు. బీసీల జనాభా లెక్కలు తేల్చి సామాజిక న్యాయం అందించిన తొలి ప్రభుత్వం తమదేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రతిపక్షంలో ఉన్న కేటీఆర్, హరీశ్‌రావు ప్రభుత్వంపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆక్షేపించారు. రాష్ట్రంలో కరువు రావాలని కోరుకుంటూ అఘోరాలతో చేతబడులు చేయించాలని ఆలోచించారు. పాత దొరల పాలన మళ్లీ రావడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వొద్దని ప్రజలను కోరారు.
మరోసారి అధికారంలోకి వచ్చేది కాంగ్రెసే ..
గత బీఆర్ఎస్ పాలనపై సీఎం రేవంత్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'నాడు గొర్రెలు, బర్రెలు, చేపలు పంపిణీ చేసి.. రాజ్యం వాళ్లు ఏలుతూ, మనల్ని కుల వృత్తులకే పరిమితం చేయాలని చూశారు' అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ సీఎం అయితే ఆయన కొడుకు కేటీఆర్ వర్కింగ్ ప్రెసిడెంట్, అల్లుడు హరీశ్ రావు మంత్రి అయ్యారని.. అదే రేవంత్ సీఎం అయితే బీసీ నేత మహేష్ కుమార్ గౌడ్ పీసీసీ చీఫ్, సీతక్క, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ (వాకిటి శ్రీహరి) మంత్రులయ్యారని వ్యంగ్యాస్త్రాలు విసిరారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ, చాకలి ఐలమ్మ మనుమరాలికి కీలక పదవులు ఇచ్చి ఉద్యమకారులను గౌరవించామని తెలిపారు. రాబోయే డీలిమిటేషన్ తర్వాత 117 సీట్లలో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## బీజేపీ జేబుసంస్థగా కేంద్ర ఎన్నికల సంఘం

మొదటి తరువాయి



హక్కు కల్పించాలని ఈసీని తెలంగాణ పీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో తెలంగాణలో ఎన్నికల సంఘం నిర్దాక్షిణ్యంగా ఓట్లను తొలగించిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. ఓటర్ల ముసాయిదా జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన నేపథ్యంలో గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము ప్రతి ఓటు హక్కు కాపాడాలని చూస్తున్నామని అన్నారు. ఎన్నికల సంఘం గైడ్‌లైన్స్‌తో చాలా నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈసీ ఉదాసీనంగా చూడటం కరెక్ట్ కాదని అభిప్రాయపడ్డారు. తెలంగాణ 3.38 కోట్ల ఓట్లు ఉన్నాయని గుర్తు చేశారు. ఎఎస్‌బీడీల పేరుతో 22 శాతం ఓట్లు తొలగించారని చెప్పారు. ఓట్ల తొలగింపునకు ప్రధాని మోదీతోపాటు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని అన్నారు. పేద ప్రజల ఓట్లు తొలగిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలను 35 వేల మందిని నియమించిందని తెలిపారు. కానీ ఈసీ మాత్రం13,100 మందిని ఇచ్చినట్లు చూపిస్తుందని చెప్పారు. సామాన్యుడి ఓటు తొలగించే ప్రయత్నం చేస్తున్నారంటూ ఈ సందర్భంగా ఈసీపై నిప్పులు చెరిగారు. 2002లో ఓటు వేసి ఉండాలని కండిషన్‌తో చాలా మంది ఎనుమరేషన్ ఫామ్స్ ఇవ్వలేక పోయారని చెప్పుకొచ్చారు. దీంతో వారిని కూడా ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్నారని వివరించారు. అన్ మ్యాపుడ్ ఓట్లు 32,37000 ఉన్నాయని అన్నారు. అలాగే 60,50,000 ఓట్లు సందేహంగా ఉన్నాయని చూపిస్తున్నారని పేర్కొన్నారు. దాంతో 92 లక్షల ఓట్లు ప్రశ్నార్థకంగా మారాయని ఆవేదనతో అన్నారు. 1.60 కోట్ల ఓట్లు ఎందుకు క్వచ్చన్ మార్క్ పెట్టారో చెప్పాలంటూ ఈసీని తెలంగాణ పీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు. దేశంలో ఓటు హక్కును తొలగించే అధికారం మీకు ఎవరు ఇచ్చారంటూ ఈసీని ఆయన సూటిగా ప్రశ్నించారు. ప్రతి పౌరుడి ఓటు కాపాడాలని కాంగ్రెస్ పార్టీ ప్రయత్నం చేస్తోందని అన్నారు. హైదరాబాద్ నగరంలో బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) అనేక ప్రాంతాల్లో ఓటర్ల ఇళ్లకు వెళ్లలేదని మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. ముఖ్యంగా పేదలు, వలస కూలీల ఓట్లే పెద్ద సంఖ్యలో తొలగించారని విమర్శించారు. 2002 నాటి ఓటర్ల జాబితా ఎంతమందికి అందుబాటులో ఉందని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎలాంటి కారణం లేకుండా 73 లక్షల ఓట్లను ఎన్నికల సంఘం తొలగించిందని మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. మొత్తంగా 92 లక్షల ఓట్లను ప్రశ్నార్థకం చేశారని పేర్కొన్నారు. డీలిమిటేషన్, పోలింగ్ కేంద్రాల మార్పు కారణంగా 2002 నాటి ఓటర్ల వివరాలతో ప్రస్తుత జాబితాను సరిపోల్చడంలో అనేక ఇబ్బందులు ఉన్నాయన్నారు.
2002 నాటి ఓటర్ల జాబితాతో ముడిపెట్టకుండా అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించాలని మహేశ్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. లక్షలాది మంది ఓట్లను తొలగించి ప్రజాస్వామ్య దేశంగా ఎలా చెప్పుకుంటామని మహేశ్‌కుమార్ గౌడ్ ప్రశ్నించారు. ఓటర్ల జాబితా సవరణ పక్రియలో జరిగిన తొలగింపులపై సమగ్రంగా పరిశీలించి అర్హులైన ఓటర్లకు తిరిగి ఓటు హక్కు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.


## తప్పు ఒప్పుకుని సరిదిద్దుతున్నాం

మొదటి తరువాయి

సాంకేతిక లోపంతో 22ఏ జాబితాలోకి
హైకోర్టు ఆదేశాల మేరకు 22ఏ నిషేధిత భూముల వివరాలను ఆన్‌లైన్ సాఫ్ట్‌వేర్‌లో అప్‌లోడ్ చేసే క్రమంలో క్షేత్రస్థాయిలో జరిగిన పొరపాట్లను ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన సరిదిద్దుతోందని మంత్రి అన్నారు. బాధ్యతాయుతమైన ప్రభుత్వంగా పొరపాటును పారదర్శకంగా అంగీకరించి అదే సమయంలో జరిగిన తప్పును సరిదిద్దే బాధ్యతను కూడా తీసుకున్నామనీ, ప్రజలను ఇబ్బందుల్లో వదిలేసే ప్రభుత్వం తమది కాదని స్పష్టం చేశారు. వివిధ జీవోలు, మెమోల ద్వారా గత ప్రభుత్వాల కాలంలో క్రమబద్ధీకరించబడిన ప్రయివేట్ భూములు, హైకోర్టు, జీహెచ్ఎంసీ/హెచ్ఎండీఏ అనుమతులు పొందిన స్థలాలు ఆన్‌లైన్ అప్‌లోడింగ్‌లో సాంకేతిక లోపం కారణంగా 22ఏ జాబితాలోకి వచ్చాయని వివరించారు. ఈ సమస్యను ప్రభుత్వం వెంటనే గుర్తించిందనీ, బాధితులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పునరుద్ధరించామని అన్నారు. 22ఏ సమస్యల త్వరిత పరిష్కారం కోసం రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఐజీ, ఇతర ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామని చెప్పారు. రాబోయే 15 రోజులపాటు ఈ కమిటీ రోజువారీగా దరఖాస్తులను పరిశీలించి ఆస్తులన్నింటినీ తక్షణమే పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.
విమర్శించడం చాలా సులువు
22ఏలో భూములు పెట్టి, వాటిని తొలగించడానికి డబ్బులు వసూలు చేస్తున్నారంటూ బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు చేస్తున్న ఆరోపణలపై పొంగులేటి ఘాటుగా స్పందించారు. "విమర్శలు చేయడం చాలా సులువు కానీ బాధ్యత తీసుకోవడం అంత సులువు కాదు. 22ఏ విషయంలో పొరపాటు జరిగిందని మేము బహిరంగంగా అంగీకరించాం. ఆ పొరపాటును సరిదిద్దే బాధ్యతను కూడా తీసుకున్నాం.'అని పొంగులేటి అన్నారు. వారు పదేండ్లు అధికారంలో ఉన్నప్పుడు ధరణి పేరుతో ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులకు, జరిగిన తప్పులకు ఏనాడైనా బాధ్యత తీసుకున్నారా? కనీసం క్షమాపణ చెప్పారా? అని ప్రశ్నించారు.
పేదవాడి సమస్యను రాజకీయంగా వాడుకోవడం మానేయాలని సూచించారు. పేదవాడి న్యాయబద్ధమైన భూమిలో ఒక్క అంగుళం కూడా అన్యాయం జరగనివ్వబోమని స్పష్టం చేశారు. తప్పు జరిగితే దాన్ని అధికారుల మీదకు నెట్టేసి చేతులు దులుపుకోవడం తమ ప్రభుత్వ విధానం కాదన్నారు. పదేండ్లు అధికారంలో ఉన్న హరీశ్‌రావుకు 30 శాతం కమీషన్లు ఎందుకు గుర్తుకొస్తున్నాయో ప్రజలకు తెలుసని చెప్పారు. కాళేశ్వరం విషయంలో జరిగిన పరిణామాలకు హరీశ్‌రావు ఏనాడైనా బాధ్యత తీసుకున్నారా?అని ప్రశ్నించారు.
ఆధారాలుంటే ప్రజల ముందు పెట్టాలి
బీజేఎల్‌పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి చేస్తున్న ఆరోపణలపై మంత్రి పొంగులేటి స్పందిస్తూ తాటాకు చప్పుళ్లకు తాను భయపడనని అన్నారు. తనపై ఏదైనా ఆరోపణ చేస్తే ఆధారాలతో మాట్లాడాలనీ, ఆధారం ఉంటే ప్రజల ముందు పెట్టాలని డిమాండ్ చేశారు. ఫీనిక్స్, రాఘవ తదితర సంస్థలతో వ్యాపార రంగంలో లావాదేవీలు జరగడం సహజమని అన్నారు. వాటిని పట్టుకుని రాజకీయ ఆరోపణలు చేయడం సరికాదని చెప్పారు.

## భారత ఎన్నికల వ్యవస్థను ఆదర్శంగా తీసుకోండి..

**అమెరికాలో ఓటర్ ఫొటో ఐడీ తప్పనిసరి చేయాలని సూచన**
**'సేవ్ అమెరికా యాక్ట్'ను ఆమోదించాలని పిలుపు**
**భారత ఎన్నికల ప్రక్రియపై ట్రంప్ ప్రశంసలు**
**అమెరికా ఎన్నికల్లో పౌరులకే ఓటు హక్కు**
**మెయిల్ ఓటింగ్‌పై ఆంక్షలు విధించే ప్రతిపాదన**
**జనవరి 29న చట్టసభల్లో బిల్లు ప్రవేశపెట్టిన ప్రభుత్వం**



వాషింగ్టన్ డీసీ:
భారతీయ ఎన్నికల వ్యవస్థను అమెరికా ఆదర్శంగా తీసుకోవాలని భావిస్తున్నది. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ఓ కామెంట్ చేశారు. భారత ఎన్నికల నిర్వహణ ప్రక్రియ ఎలా సాగుతుందో.. ఆ రీతిలో ఓటర్ ఫోటో ఐడీ కార్డులను మనం కూడా తీసుకురావాలని ట్రంప్ పేర్కొన్నారు. ఇటీవల భారత ముఖ్య ఎన్నికల అధికారి జ్ఞానేశ్ కుమార్ .. అమెరికా ప్రభుత్వ పెద్దలతో భేటీ అయ్యారని, ఫోటో ఐడీ లేకుండానే ఎలా అమెరికాలో ఎన్నికలను నిర్వహిస్తున్నారని సీఈవో జ్ఞానేశ్ ప్రశ్నించారని ట్రంప్ పేర్కొన్నారు. ట్రుత్ సోషల్‌లో ట్రంప్ ఓ పోస్టు చేశారు. ఆ పోస్టులో ట్రంప్ .. భారతీయ ఎన్నికల ప్రక్రియను మెచ్చుకున్నారు. గత జాతీయ ఎన్నికల్లో సుమారు 64.6 కోట్ల మంది ఓటు వేశారాని, దాంట్లో ఒక్క శాతం కన్నా తక్కువ సంఖ్యలో ఓటర్లు మెయిల్ ద్వారా ఓటు వేశారని, ప్రతి సింగిల్ ఓటర్‌కు ప్రత్యేకంగా ఫోటో ఐడీ కార్డు ఉందని, అయితే అదే తరహాలో అమెరికాలోనూ ఓటరు ఫోటో ఐడీలు కావాలని, దీని కోసం రూపొందించిన అమెరికా సేవ్(సేఫ్‌గార్డ్ అమెరికన్ ఓటర్ ఎలిజిబిలిటీ) యాక్ట్‌ను ఉభయసభల్లో పాస్ చేయాల్సిన అవసరం ఉందని ట్రంప్ తన పోస్టులో వెల్లడించారు.వైట్‌హౌజ్ దీనిపై స్పందించింది. కేవలం అమెరికా పౌరులు మాత్రమే.. అమెరికా ఎన్నికల ప్రక్రియలో ఓటు వేయాలన్న ఉద్దేశాన్ని వ్యక్తం చేసింది. కేవలం అమెరికా పౌరులు మాత్రమే అమెరికా ఎన్నికలను డిసైడ్ చేయాలని వైట్‌హౌజ్ తన ప్రకటనలో తెలిపింది. అమెరికా సేవ్ యాక్ట్ బిల్లను పాస్ చేయాలని కోరింది. ఫెడరల్ ఎన్నికల వ్యవస్థలో ఓటు వేయడానికి ముందు రిజిస్టర్ చేసుకోవాలని, దీని కోసమే ఈ చట్టాన్ని ప్రతిపాదిస్తున్నట్లు వైట్‌హౌజ్‌త తెలిపింది.

## దేశంలో 14 మంది సీఎంలపై క్రిమినల్ కేసులు..

మొదటి తరువాయి

అంశంపై ఈ నివేదికను సుప్రీంకోర్టుకు అందజేశారు. జూలై, 2026 నాటికి ఉన్న కేసులకు సంబంధించిన వివరాలివి. ఈ నివేదిక ప్రకారం.. దేశంలోని 28 మంది సీఎంలలో 14 మందిపై క్రిమినల్ కేసులున్నాయి. వారిలో 89 కేసులతో సీఎం రేవంత్ రెడ్డి మొదటి స్థానంలో ఉన్నారు. ఆ తర్వాత పశ్చిమ బెంగాల్ సీఎం సువేందు అధికారి 29 కేసులతో రెండో స్థానంలో ఉన్నారు. కర్ణాటక సీఎం డీకే శివకుమార్, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఇద్దరూ చెరో 19 కేసులతో మూడో స్తానంలో ఉన్నారు. ఆ తర్వాత స్థానాల్లో వరుసగా కేరళ సీఎం వీడీ సతీషన్ 18 కేసులు, జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ 5 కేసులు, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్, హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సింగ్ చెరో 4 కేసులు, తమిళనాడు సీఎం విజయ్, బిహార్ సీఎం సామ్రాట్ చౌదరి చెరో 2 కేసులు కలిగి ఉండగా, సిక్కిం సీఎం పీఎస్ తమాంగ్, పంజాబ్ సీఎం భగవంత్ మన్, ఒడిశా సీఎం మోహన చరణ్ మాంఝీ, రాజస్థాన్ సీఎం భజన్ లాల్ శర్మ ఒక్కో కేసు కలిగి ఉన్నారు. దేశంలోని ప్రస్తుత, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలపై 4,192 క్రిమినల్ కేసులున్నాయి. అత్యధికంగా యూపీలో ఎంపీలు, ఎమ్మెల్యేలపై కలిపి 1,171 క్రిమినల్ కేసులున్నాయి.

# యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు

**-ఎరువులు లేవని బోర్డు... రోడ్డుపై బైఠాయించిన రైతులు**

**-వరి నాట్ల సమయంలో యూరియా కొరత... రైతుల ఆందోళన**






**గాంధారి, ఆగస్టు 19: (మహాప్రభ)** మండల కేంద్రంలో మంగళవారం యూరియా కోసం రైతులు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్నప్పటికీ స్టాక్ లేదంటూ అధికారులు బోర్డు పెట్టడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వరి నాట్ల సమయంలో యూరియా అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే ఎరువుల సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రైతుల నిరసనతో కొంతసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న అధికారులు వచ్చి మాట్లాడిన అనంతరం రైతులు నిరసన విరమించారు.

# పేద ఎస్సీ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేసిన దాట్ల పృధ్వీరాజ్



**ముమ్మిడివరం, -18ఆగస్ట్ (మహాప్రభ ).**
ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పుట్టినరోజు సందర్భంగా పేద ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తామని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు దాట్ల పృధ్వీరాజ్ ఇచ్చిన మాట మేరకు మంగళవారం విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించారు.దాట్ల పృధ్వీరాజ్ అన్న స్వర్గీయ దాట్ల సీతారామరాజు రెండవ వర్ధంతి సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గం ఐపోలవరం మండలంశమురమళ్ళ గ్రామంలో గల ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఐ. పోలవరం మండలానికి చెందిన సుమారు 13 మంది పేద ఎస్సీ విద్యార్థులకు మొత్తం రూ.40,000 ఆర్థిక సహాయాన్ని దాట్ల పృధ్వీరాజ్, కుటుంబ సభ్యులు మరియు స్నేహితుల చేతుల మీదుగా అందజేశారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ ఆర్థిక సహాయం అందించడం పట్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు తమ వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తామని ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు తెలిపారు.

# నసర్లపల్లిలో ఉచిత వైద్య శిబిరం

**-కామినేని హాస్పిటల్స్ సౌజన్యంతో 110 మందికి వైద్య పరీక్షలు**



**చింతపల్లి, -18ఆగస్ట్ (మహాప్రభ ).**
చింతపల్లి మండలం నసర్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలో కామినేని హాస్పిటల్స్, ఎల్‌బీ నగర్ సౌజన్యంతో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామపంచాయతీ సర్పంచ్ పంబలి మాలతి వెంకటయ్య చేతుల మీదుగా శిబిరాన్ని ప్రారంభించారు. ఉదయం 9.45 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగిన శిబిరంలో బీపీ, షుగర్, కంటి, ఎముకలు, కీళ్ల నొప్పులు, దంత సమస్యలు, చిన్నారుల ఆరోగ్య పరీక్షలతో పాటు సాధారణ రక్త పరీక్షలు, ఈసీజీ తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. తీవ్ర ఆరోగ్య సమస్యలు ఉన్నవారిని ప్రధాన ఆసుపత్రికి సిఫారసు చేసి, తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామని వైద్యులు తెలిపారు. శిబిరంలో మొత్తం 110 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు.
కార్యక్రమంలో కామినేని ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రుషిత, డాక్టర్ వినోది, డాక్టర్ లక్ష్మి, నర్సింగ్ సిబ్బంది ప్రియ, అశ్విత, మార్కెటింగ్ క్యాంపు కోఆర్డినేటర్ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# అనుమతులు లేకుండా మద్యం తరలిస్తున్న వాహనం సీజ్‌కు ఆదేశం

**మిడ్జిల్, -18ఆగస్ట్ (మహాప్రభ ).**
గ్రామంలో పర్యటిస్తున్న సమయంలో అనుమతులు లేకుండా మద్యం తరలిస్తున్న వాహనాన్ని కలెక్టర్ గుర్తించారు. గ్రామంలోని బెల్ట్‌షాపులకు అనధికారికంగా మద్యం విక్రయిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. దీంతో ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, వాహనాన్ని స్వాధీనం చేసుకోవాలని సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అలాగే, అక్రమ మద్యం విక్రయాలకు సంబంధించి బాధ్యులైన మద్యం దుకాణం లైసెన్స్‌ను రద్దు చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో మహబూబ్‌నగర్ రూరల్ తహసీల్దార్, ఎం.పి.డి. ఓ , ఎం.పి. ఓ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ప్రసన్నాంజనేయ స్వామి సన్నిధిలో హనుమాన్ చాలీసా పారాయణం

**దేవరకద్ర, ఆగస్టు 18: మహాప్రభ దేవరకద్ర**
భక్తి, ఆధ్యాత్మికత, విశ్వాసాలకు ప్రతీకగా నిలిచిన దేవరకద్ర ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో ప్రతి మంగళవారం హనుమాన్ చాలీసా పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. స్వామివారి సన్నిధిలో మారుమోగుతున్న హనుమాన్ చాలీసా పారాయణం భక్తుల హృదయాలను భక్తిభావంతో నింపుతూ, ఆలయ ప్రాంగణాన్ని ఆధ్యాత్మిక శోభతో అలరారిస్తోంది. మంగళవారం ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని ప్రసన్నాంజనేయ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అనంతరం సామూహికంగా హనుమాన్ చాలీసా పారాయణం చేస్తూ "శ్రీరామ జయరామ జయ జయ రామ", "జై శ్రీరామ్.. జై హనుమాన్" నామస్మరణతో స్వామివారిని స్మరిస్తున్నారు. హనుమంతుని భక్తి, ధైర్యం, శక్తి, సేవా భావాలను స్మరించుకుంటూ



హనుమాన్ చాలీసా పారాయణం చేయడం ద్వారా మనసుకు ప్రశాంతత, ఆత్మకు ఆధ్యాత్మిక బలం లభిస్తాయని భక్తులు విశ్వసిస్తున్నారు. స్వామివారి కృపతో ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, ఆరోగ్యం, ఐశ్వర్యం, ధైర్యం వెల్లివిరియాలని భక్తులు ప్రార్థిస్తున్నారు.

హనుమాన్ చాలీసాలోని ప్రతి అక్షరం భక్తి పరిమళాన్ని వెదజల్లుతుండగా.. ప్రతి శ్లోకం భక్తుల హృదయాల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపుతోంది. స్వామివారి సన్నిధిలో కొద్దిసేపు గడిపినా మనసులోని ఆందోళనలు తొలగిపోయి, కొత్త ఉత్సాహం, నమ్మకం కలుగుతుందని భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి మంగళవారం జరిగే ఈ పవిత్ర హనుమాన్ చాలీసా పారాయణంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసన్నాంజనేయ స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ నిర్వాహకులు కోరుతున్నారు.
"భక్తి ఉన్న చోట హనుమంతుడు ఉంటాడు..
హనుమంతుడు ఉన్న చోట ధైర్యం ఉంటుంది..
ధైర్యం ఉన్న చోట విజయమే ఉంటుంది."
జై శ్రీరామ్..! జై హనుమాన్..! విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం జరుగుతుంది

# బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు పాపన్న గౌడ్.

**-మెదక్ మున్సిపల్ మాజీ ఆరేళ్ల. మల్లికార్జున్ గౌడ్.**

**మెదక్ జిల్లా -18ఆగస్ట్ (మహాప్రభ ).**
బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను కొనసాగించాల్సిన అవసరం ఉందని మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్ అన్నారు. పాపన్న గౌడ్ జయంతిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు.
ఈ సందర్భంగా పట్టణంలోని పసుపులేరు ఒడ్డున ఎల్లమ్మ తల్లి దేవాలయం వద్ద గల సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి మల్లికార్జున్ గౌడ్, పట్టణ పార్టీ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు బిఆర్ఎస్ కౌన్సిలర్లు నాయకులతో కలిసి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..సామాజిక అసమానతలను ఎదిరించి అణగారిన వర్గాల హక్కుల కోసం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చేసిన పోరాటం చరిత్రలో చిరస్మరణీయమన్నారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని గౌడ సమాజం హక్కుల సాధనకు ఐక్యంగా ముందుకు




సాగాలని పిలుపునిచ్చారు.ఎన్నికల సమయంలో గౌడ సంఘం నాయకులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే గౌడ సమాజం తరఫున తిరగబడాల్సి వస్తుందని హెచ్చరించారు. గౌడుల సమస్యలను పరిష్కరించి, హామీలను నెరవేర్చేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అకిరెడ్డి. కృష్ణారెడ్డి, పట్టణ పార్టీ కో కన్వీనర్ గడ్డమీది.కృష్ణ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్ దీపక్ కుమార్, జుబేర్ అహ్మద్, మాజీ కౌన్సిలర్ మాయ. మల్లేశం,ఆర్కే శ్రీనివాస్ చంద్రశేఖర్ గౌడ్, భీమరి.కిషోర్, నాయకులు ఇందాద్, తదితరులు పాల్గొన్నారు.

# హవెలిఘనాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ వార్షిక తనిఖీ.

**-సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలి.**

**-రౌడీషీటర్లు, సస్పెక్ట్‌లపై నిరంతర నిఘా.**

**-సీసీ కెమెరాల ఏర్పాటు, బీట్ వ్యవస్థను బలోపేతం చేయాలి.**

**-మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్.**

**మెదక్ జిల్లా -18ఆగస్ట్ (మహాప్రభ ).**
వార్షిక తనిఖీల్లో భాగంగా మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ మంగళవారం హవెలిఘనాపూర్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది కిట్‌ను పరిశీలించారు. స్టేషన్ నిర్వహణ, నేరాల దర్యాప్తు, రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరు, పెండింగ్ కేసుల పురోగతిని సమీక్షించారు. ఎఫ్ఐఆర్‌ల నమోదు, స్టేషన్ డైరీలు, రౌడీ, సస్పెక్ట్ షీట్లు, బీట్ బుక్స్, సీజ్ ప్రాపర్టీ రికార్డులు, వారెంట్ల అమలు, సీసీటీఎన్ఎస్, ఈ-సాక్ష్య నమోదు తదితర అంశాలను ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీస్‌స్టేషన్లలో కేసుల పెండెన్సీ లేకుండా రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ




సక్రమంగా నిర్వహించాలని సూచించారు. బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా నాణ్యమైన, పారదర్శకమైన దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారి సమస్యలను ఓర్పుతో విని చట్టపరమైన సహాయం అందించాలని ఎస్పీ సూచించారు. వ్యాపార సంస్థలు, దుకాణాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటును ప్రోత్సహించాలని, నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.

విలేజ్ పోలీస్ ఆఫీసర్లు తమ పరిధిలోని గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై ప్రతి గ్రామంలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. యువతను డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్ వంటి వ్యసనాలకు దూరంగా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.రౌడీషీటర్లు, సస్పెక్ట్‌ల కదలికలపై నిరంతర నిఘా కొనసాగించాలని, నేరాల నియంత్రణకు బీట్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని ఎస్పీ ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం స్టేషన్ సిబ్బందితో సమావేశమైన ఎస్పీ.. బెట్టింగ్ వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. విధుల నిర్వహణతో పాటు సిబ్బంది వ్యక్తిగత సమస్యలను కూడా అడిగి తెలుసుకున్నారు. పోలీసు సిబ్బంది క్రమశిక్షణ, ఆరోగ్యం, సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, సీఐలు కృష్ణమూర్తి, సందీప్‌రెడ్డి, ఎస్ఐ సత్యనారాయణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి

**దేవరకద్ర : ఆగస్టు 18 మహాప్రభ**
సామాజిక సమానత్వం, ఆత్మగౌరవం, ప్రజా సంక్షేమం కోసం పోరాడిన వీరయోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని దేవరకద్ర ఎమ్మెల్యే శ్రీ జి. మధుసూదన్ రెడ్డి (GMR) అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి పాల్గొని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, అణగారిన వర్గాల హక్కులు, ఆత్మగౌరవం కోసం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చేసిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు.



సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన చూపిన మార్గం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. పాపన్న గౌడ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఆయన సేవలు, పోరాట స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# వడ్డెర కులాన్ని తక్షణమే ఎస్టీ జాబితాలో చేర్చాలి.

**-వడ్డెర సంఘం దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు ఇరగదిండ్ల కృష్ణ డిమాండ్.**

**దేవరకొండ ఆగస్టు 18( మహా ప్రభ)**
ఆర్థికంగా, సామాజికంగా తీవ్ర వెనుకబాటుతనానికి గురైన వడ్డెర కులస్తులను వెంటనే ఎస్టీ జాబితాలో చేర్చాలని నల్లగొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గ వడ్డెర సంఘం అధ్యక్షులు ఇరగదిండ్ల కృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత 40 సంవత్సరాలుగా వడ్డెర కులస్తులు తీవ్రమైన పేదరికంలో జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాళ్ళు కొట్టడం, కంకర కొట్టడం, ప్రాజెక్టుల్లో కఠినమైన కూలీ పనులు చేసుకోవడం తప్ప తమకు ఎలాంటి భూములు, ఆస్తులు లేవని స్పష్టం చేశారు. రోజువారీ కూలికి వెళ్తేనే ఇల్లు గడిచే దయనీయ స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు.
ఉపాధి లేక యువత ఆత్మహత్యలు:



సమాజంలో వడ్డెర కులంలో కేవలం 5 శాతం మంది మాత్రమే చదువుకోగలుగుతున్నారని, తల్లిదండ్రులు రెక్కలు ముక్కలు చేసుకుని పిల్లలను చదివించినప్పటికీ ప్రభుత్వ ఉద్యోగాల్లో సరైన రిజర్వేషన్లు లేక నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారని తెలిపారు. సరైన గుర్తింపు, ఉపాధి దక్కక తీవ్ర మనోవేదనతో ఎంతోమంది యువకులు ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటనలు ఉన్నాయని గుర్తుచేశారు.
ఎన్నికల హామీలను నిలబెట్టుకోవాలి:
గతంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ, పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి పర్యటనల సందర్భంగా వడ్డెరల సమస్యలను గుర్తించి, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎస్టీ జాబితాలో చేరుస్తామని బహిరంగ సభల్లో, మునుగోడు ఎన్నికల ప్రచారంలోనూ హామీ ఇచ్చారని తెలిపారు. అయితే ప్రభుత్వం ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా ఆ హామీ అమలుకు నోచుకోకపోవడం దారుణమన్నారు.
తెలంగాణ వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి ఐలమల్లు నేతృత్వంలో గత 9 సంవత్సరాలుగా మంత్రులు, ప్రజాప్రతినిధులను కలిసి అనేక వినతిపత్రాలు అందజేసినా, ధర్నాలు నిర్వహించినా ప్రభుత్వాల నుంచి సరైన స్పందన రాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం అసెంబ్లీలో ప్రత్యేక తీర్మానం చేసి, వడ్డెర కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చేలా కేంద్రానికి సిఫారసు చేయాలని కోరారు. ప్రభుత్వం తమ డిమాండ్‌ను విస్మరిస్తే రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం తప్పదని ఈ సందర్భంగా హెచ్చరించారు.

# బహుజనులు రాజ్యాధికారం కోసం పోరాటం చేయాలి

**-బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్**

**దేవరకొండ ఆగష్టు18 ( మహా ప్రభ)**
దేవరకొండ పట్టణంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న 376 వ జయంతి వేడుకలు ఘనంగా జరిగినాయి. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ జయంతి ఉత్సవాల్లో బిసి, ఎస్సి ,ఎస్టి ,మైనార్టీ సంఘం నాయకులు పెద్ద మొత్తంలో పాల్గొన్నారు. ఈ జయంతి ఉత్సవాల్లో వివిధ రంగాల్లో రానిచ్చినటువంటి సామాజిక కార్యకర్తలు ,మహిళలు ,మేధావులు, కార్మిక, కర్షకులను ఘనంగా సన్మానించినారు.
ఈ సందర్భంగా సామాజికవేత్త, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రాజ్యాధికారం కోసం పోరాడాలని, సర్దార్ సర్వాయి పాపన్న ఆశయ సాధన కోసం కృషి చేస్తూ, ఆయన తాటి చెట్టు పై చేయి వేయడం కాదు



కొడితే గోల్కొండ ఖిల్లా అనే కొట్టాలి అని పిలుపునిచ్చి భారత దేశ స్వాతంత్ర ఉద్యమంలో తొలి స్వాతంత్ర ఉద్యమకారుడుగా, తొలి బహుజన సామ్రాజ్యాన్నీ స్థాపించిన గొప్ప నాయకుడని కొనియాడారు .గోల్కొండ తో పాటు 18 దుర్గాలకు రాజుగా పాలించిన బహుజన చక్రవర్తి అని కొనియాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ ,మైనార్టీలు ఏకమై బహుజన రాజ్యాధికారం కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్డి కోటేశ్వరరావు, పున్న వెంకటేష్ నేత , చోల్లేటిభాస్కరాచారి, డాక్టర్ ఏకుల రాజారావు, ఉప్పల శీను నేత, దబ్బీకార్ పెంటోజి,ఏరుకొండల రాము, మునగాల గణేష్,పున్న బిక్షమయ్య ,ముక్కామల బాలయ్య, శవ్వ నారాయణయాదవ్ ,పోతాం సహదేవ్, కుంభం బాలచందర్ గౌడ్ ,ఇంద్రకంటి ఈదయ్య గౌడ్, నాగిళ్ల క్రిష్టఫర్, బోయపల్లి చంద్రమౌళి ,ఏకులఓ సురేష్, ఎండి అబ్దుల్ సత్తార్, అబ్దుల్ కలాం, తోటపల్లి శీను, రాచమల్ల నాగయ్య, కానుగుల చంద్రశేఖర్, కాటం గోవర్ధన్ ,ఎరుకల వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

# కోయిల్ సాగర్ ఆయకట్టుకు ఊరటనిచ్చిన జిఎంఆర్..

**- రేపటి నుంచి ఏడు రోజుల పాటు కాలువలకు నీటి విడుదల**

**దేవరకద్ర: ఆగస్టు 18 మహాప్రభ**
దేవరకద్ర కోయిల్ సాగర్ ఆయకట్టు రైతులకు ఊరటనిచ్చేలా సాగునీటి విడుదలపై దేవరకద్ర ఎమ్మెల్యే శ్రీ జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) కీలక నిర్ణయం తీసుకున్నారు. కోయిల్ సాగర్ ఆయకట్టుకు నీటి విడుదల అంశంపై ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్ అధికారులతో పాటు ఆయకట్టు రైతులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయకట్టు పరిస్థితులు, కోయిల్ సాగర్ రిజర్వాయర్‌లో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, ఆయకట్టు పరిధిలోని చెరువుల నింపుదల, భూగర్భ జలాల రీచార్జ్ తదితర అంశాలపై ఎమ్మెల్యే అధికారులతో, రైతులతో సమగ్రంగా చర్చించారు. ప్రస్తుతం కోయిల్ సాగర్ రిజర్వాయర్‌లో 0.9 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని, అందులో తాగునీటి అవసరాల కోసం 0.6 టీఎంసీల నీటిని కేటాయించాల్సి ఉందని ఎమ్మెల్యే జిఎంఆర్ తెలిపారు. పరిమిత నీటి లభ్యత ఉన్నప్పటికీ రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని సాధ్యమైనంత మేర ప్రయోజనం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రేపు ఉదయం 9 గంటల నుంచి మొదటి విడతగా ఏడు రోజుల పాటు కాలువల ద్వారా నీటిని విడుదల చేయనున్నట్లు





ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ నీటితో ఆయకట్టు పరిధిలోని చెరువులను నింపడంతో పాటు బోర్లు రీచార్జ్ అయ్యేలా ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు.
సాధారణ పరిస్థితుల్లో కోయిల్ సాగర్ కాలువలకు నీటిని విడుదల చేయాలంటే రిజర్వాయర్‌లో కనీసం 1.5 టీఎంసీల నీటి నిల్వ అవసరమవుతుందని ఎమ్మెల్యే వివరించారు. అయితే ప్రస్తుతం ఉన్న నీటి లభ్యత, రైతుల అవసరాలు, భూగర్భ జలాల రీచార్జ్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక చొరవతో నీటిని విడుదల చేస్తున్నామని స్పష్టం చేశారు.అయితే నీళ్లు వస్తున్నాయనే ఉద్దేశంతో రైతులు కొత్తగా తుకాలు వేయవద్దని జిఎంఆర్ సూచించారు. ప్రస్తుతం ఉన్న నీటి పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని రైతులు ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని, అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఇదిలా ఉండగా, ప్రస్తుతం ఉంద్యాల పంప్‌హౌస్ నుంచి రెండు మోటార్ల ద్వారా కోయిల్ సాగర్ రిజర్వాయర్‌కు నీటిని తరలిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. రానున్న వారం రోజుల్లో రిజర్వాయర్‌లో నీటి మట్టం ఎంతమేర పెరిగిందో పరిశీలించి, అప్పటికి అందుబాటులో ఉండే నీటి నిల్వ ఆధారంగా రైతులకు సాధ్యమైనంత మేర సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతుల సాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇస్తూనే తాగునీటి అవసరాలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నీటి నిర్వహణ చేపడుతున్నామని ఎమ్మెల్యే జిఎంఆర్ పేర్కొన్నారు. రైతుల పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించి ఆయకట్టుకు అండగా నిలుస్తామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంజన్ రెడ్డి అధికారులు పార్టీ కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు

# గాంధారి మండలంలో డీఆర్డీఓ పర్యటన సోమ్లు నాయక్ తండాలో ఫామ్ పాండ్

**-గ్రామీణ అభివృద్ధి పనులను పరిశీలించిన డీఆర్డీఓ దామోదర్ రెడ్డి**

**గాంధారి, ఆగస్టు 19: (మహాప్రభ)**
గాంధారి మండల ప్రత్యేక అధికారి, డీఆర్డీఓ దామోదర్ రెడ్డి మంగళవారం మండలంలో పర్యటించారు. ముందుగా సోమ్లు నాయక్ తండా గ్రామంలో ఫామ్



పాండ్‌కు మార్కౌట్ చేశారు. అనంతరం గాంధారి గ్రామంలో నిర్మిస్తున్న నూతన కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ పనులను పరిశీలించారు. పనుల నాణ్యత, త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్, మాజీ సర్పంచ్ సంజువ్ యాదవ్, మండల అధికారులు, కార్యదర్శులు, వార్డ్ మెంబర్లు, తదితరులు పాల్గొన్నారు.

# నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు ఘన నివాళులు



**దేవరకొండ ఆగస్టు 18( మహా ప్రభ)**
మంగళవారం నల్గొండ పట్టణం లోని ఆర్ టి సి కాలనీ ప్రజా హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యక్రమంలో ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకులు, దేశం కోసం తన ప్రాణాలను అర్పించిన ఒక గొప్ప స్వాతంత్ర్య సమరయోధులు నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతి సందర్భంగా వారికి ఘన నివాళులు అర్పించిన ప్రజా హక్కుల సాధన సమితి వ్యవస్థాపక,రాష్ట్ర అధ్యక్షుడు తిరుగమల్ల షాలెమ్ రాజు.ఇట్టి కార్యక్రమంలో ఆయన వెంట స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కలకుంట్ల వినోద్ చారి,నాగరాజు, రమేష్,కార్తీక్,బన్నీ సూర్యనారాయణ,శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

# దేవరకొండ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల లెక్చరర్ భాస్కర్‌పై చర్యలు తీసుకోవాలి

**--విద్యార్థి సంఘాల డిమాండ్**



**దేవరకొండ ఆగస్టు 18( మహాప్రభ )**
దేవరకొండ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా పనిచేస్తున్న భాస్కర్ బాలికల పట్ల అసభ్యంగా వ్యవహరించారనే ఆరోపణలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.మంగళవారం బి.ఆర్.ఎస్.వి., ఎ.బి.వి.పి., ఎస్. ఎఫ్.ఐ. విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో దేవరకొండ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ, విద్యార్థినుల భద్రతకు భంగం కలిగించేలా వ్యవహరించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న లెక్చరర్ భాస్కర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.ఆరోపణలపై సమగ్రంగా విచారణ జరిపి, వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాలని, ఆరోపణలు నిజమని తేలితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే భాస్కర్‌పై సంబంధిత పోలీస్ కేసు నమోదు చేసి, విద్యార్థినులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.కళాశాలలో విద్యార్థినులకు సురక్షితమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత విద్యాశాఖ అధికారులపై ఉందని, ఈ ఘటనపై అధికారులు నిర్లక్ష్యం వహించకుండా వెంటనే స్పందించాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల రాజు, బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ, ఏ.బి.వి.పి. నాయకులు గోపీచంద్, ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షులు బుడిగ వెంకటేష్,ముదిగొండ హరిదాస్ తదితరులు

# డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ స్వాగతం పలికిన బి.ఆర్ ఎస్. నాయకుడు రమేష్ నాయక్



**దేవరకొండ ఆగస్టు 18( మహాప్రభ)**



నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగిన పలు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ని బిఆర్ఎస్ పార్టీ దేవరకొండ నియోజకవర్గం నాయకులు రామావత్ రమేష్ నాయక్ నల్లగొండ బైపాస్ రోడ్డులోని ఆర్ఎస్.పి. కి స్వాగతం పలికి అక్కడి నుండి నల్లగొండ కలెక్టరేట్ ముందు జరిగిన కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ ధర్నా కార్యక్రమంలో పాల్గొని కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుట్రలపై నల్లగొండ కలెక్టర్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది అనంతరం నూతన కంటి వెంకన్న రజిని నూతన గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొని తదనంతరం స్వేరోస్ ముఖ్య నాయకులకు ఆర్.ఎస్.పి.భవిష్యత్తు కార్యాచరణ పై దిశ నిర్దేశం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు పూదరి సైదులు, నర నిర్మల, చాట్ల చిరంజీవి, గుద్దేటి నాగార్జున, గండు నాగేంద్రబాబు, స్వేరోస్ నాయకులు అనుముల సురేష్, గ్యార యాదగిరి, అనిల్, పాండు,చారి,బాలు నాయక్, రత్న కుమారి, గోస్కొండ కవిత, శ్రావణ్ ,రాము, నవీన్, చరణ్ తదితరులు పాల్గొన్నారు

# జై గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా పాపన్న గౌడ్ జయంతి



**తాడ్వాయి,ఆగస్టు18(మహాప్రభ)** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతిని పురస్కరించుకుని జై గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం తాడ్వాయి మండలం ఎర్రపాడు గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జై గౌడ్ జిల్లా అధ్యక్షుడు రంగోల్ల మురళి గౌడ్ మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సామాజిక సమానత్వం కోసం చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాపన్న గౌడ్ చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. పాపన్న గౌడ్ ఆశయాలు, స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జై గౌడ్ జిల్లా ఉపాధ్యక్షుడు కరోల్ల శేఖర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి అంకన్నగారి శ్రీనివాస్ గౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తూప్రాన్ ప్రకాష్ గౌడ్, కార్తిక్ గౌడ్, ముఖేష్ గౌడ్, అంజాగౌడ్, గైన్ రాజలింగం, అచ్యుతరావు, బద్దం సంజీవరెడ్డి, అనిల్ చారి తదితర జై గౌడ్ నాయకులు, గౌడ సంఘం ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉప సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడిగా బాలరాజ్





**పాపన్నపేట, ఆగస్టు 18( మహా ప్రభ )** మండల ఉప సర్పంచుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తానని మండల ఉప సర్పంచుల ఫోరమ్ నూతన అధ్యక్షుడు నామపూర్ రోడ్డ బాలరాజు అన్నారు. మంగళవారం పాపన్నపేట లోని ఓ ఫంక్షన్ హాల్ లో మండల ఉపసర్పంచుల ఫోరమ్ ఎంపికను చేపట్టారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్ గౌడ్,జిల్లా అధ్యక్షుడు అనిల్ కుమార్ సమక్షంలో ఈ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా సలీం రేష్మ,పత్రి సాయిలు,అనిత కృష్ణ,కోశాధికారిగా తోట్ల నిఖిత ప్రశాంత్ లను ఎన్నుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు బొట్ల కార్తీక్ ఆదేశాల మేరకు పాపన్నపేట మండల ఉప సర్పంచుల ఫోరం నూతన కమిటీని రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలమాకుల రమేష్ గౌడ్,జిల్లా అధ్యక్షుడు వెల్మకన్నే అనిల్ కుమార్ సమక్షంలో పాపన్నపేట మండల ఉప సర్పంచుల ఫోరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్బంగా ఉపాధ్యక్షుడు సలీం రేష్మ,పత్రి సాయిలు,అనిత కృష్ణ,కోశాధికారిగా తోట్ల నిఖిత ప్రశాంత్ లను ఎన్నుకున్నారు .

# మోడల్ స్కూల్ హాస్టల్‌ను తక్షణమే ప్రారంభించాలి

--- విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యంతో నేటికీ తెరుచుకోని మోడల్ స్కూల్ హాస్టల్

-విద్య సంవత్సరం ప్రారంభం అయి నేటికి మూడు నెలలు గడుస్తున్న తెరుచుకొని మోడల్ స్కూల్ హాస్టల్

- రెండు రోజుల్లో హాస్టల్ ప్రారంభించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతాం

-బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ



**దేవరకొండ ఆగస్టు 18 ( మహాప్రభ )** పీఏ పల్లి మోడల్ స్కూల్ హాస్టల్‌ను తక్షణమే ప్రారంభించాలని బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ విద్యాశాఖ అధికారులను డిమాండ్ చేశారు. మంగళవారం పీఏ పల్లిలో ఆయన మాట్లాడుతూ.....హాస్టల్ ప్రారంభం కాకపోవడంతో మోడల్ స్కూల్ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై రోజులు గడుస్తున్నప్పటికీ విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా నేటికీ హాస్టల్ తెరుచుకోకపోవడం బాధాకరమన్నారు. హాస్టల్ సౌకర్యం లేక విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి హాస్టల్‌ను ప్రారంభించే చర్యలు చేపట్టాలని బొడ్డుపల్లి కృష్ణ డిమాండ్ చేశారు.రెండు రోజుల్లోగా పీఏ పల్లి మోడల్ స్కూల్ హాస్టల్‌ను ప్రారంభించకపోతే విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన విద్యాశాఖ అధికారులను హెచ్చరించారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అధికారులు ఇకనైనా నిర్లక్ష్యాన్ని వీడి తక్షణమే హాస్టల్‌ను ప్రారంభించాలని ఆయన కోరారు.

# రెడ్డి సంఘం అధ్యక్షుడిగా ఎల్లేటి తిరుపతిరెడ్డి



**తాడ్వాయి,ఆగస్టు18(మహాప్రభ)** తాడ్వాయి మండలం కన్కల్ గ్రామంలో రెడ్డి సంఘం అధ్యక్షుడిగా ఎల్లేటి తిరుపతిరెడ్డిని, రెడ్డి సంఘ సభ్యులు ఏకగ్రీవంగా నియమించారు. గ్రామంలోని రెడ్డి సంఘ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయనను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూ.. గ్రామంలో రెడ్డి సంఘాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు సభ్యుల ఐక్యత, సంక్షేమం కోసం కృషి చేయాలని ఆకాంక్షించారు. సంఘ అభివృద్ధికి అందరి సహకారంతో ముందుకు సాగాలని సూచించారు. అధ్యక్షుడిగా ఎన్నికైన ఎల్లేటి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సభ్యులందరి సహకారంతో సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని, ఐకమత్యంతో సమస్యల పరిష్కారానికి పాటుపడతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘ సభ్యులు, గ్రామానికి చెందిన పలువురు పెద్దలు పాల్గొన్నారు.

# దేవరకద్ర రైతులకు విద్యుత్ భరోసా..





**రైతు పొలానికి వెలుగులు నింపేలా 800 ట్రాన్స్‌ఫార్మర్లు - - ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి**


**- రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్) అన్నారు. వ్యవసాయానికి విద్యుత్ సమస్యలు తలెత్తకుండా రైతుల అవసరాలను ముందుగానే గుర్తించి విద్యుత్ సామగ్రిని అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు.**

**దేవరకద్ర ఆగస్టు 18 మహాప్రభ** దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద మంగళవారం దేవరకద్ర మున్సిపాలిటీ, మండల పరిధిలోని రైతులకు వ్యవసాయ అవసరాల కోసం 40 ట్రాన్స్‌ఫార్మర్లు, ఏబీ స్విచ్‌లు, వైర్లు, విద్యుత్ పోల్స్ తదితర సామగ్రిని ఎమ్మెల్యే జీఎంఆర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం వర్షాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో పలువురు రైతులు బోర్లపై ఆధారపడి సాగు కొనసాగిస్తున్నారని చెప్పారు. ఇలాంటి సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడి రైతులు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని దేవరకద్ర నియోజకవర్గానికి సుమారు 800 ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరగా.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం వెంటనే స్పందించి 800 ట్రాన్స్‌ఫార్మర్లను మంజూరు చేసిందని ఎమ్మెల్యే తెలిపారు. మొదటి విడతలో భాగంగా దేవరకద్ర మండల రైతులకు 40 ట్రాన్స్‌ఫార్మర్లు అందిస్తున్నామని, మరో పది రోజుల్లో 60 ట్రాన్స్‌ఫార్మర్లు అందజేస్తామని వెల్లడించారు. నియోజకవర్గంలోని ప్రతి మండలంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి రైతులకు అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లను దశలవారీగా అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు వైర్లు, ఏబీ స్విచ్‌లు, పోల్స్ వంటి అవసరమైన విద్యుత్ సామగ్రిని కూడా రైతులకు అందిస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

విద్యుత్ వ్యవస్థ బలోపేతమే లక్ష్యం ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేవరకద్ర నియోజకవర్గంలో రైతుల అవసరాలకు అనుగుణంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని జీఎంఆర్ తెలిపారు. ముఖ్యంగా విద్యుత్ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు 13 సబ్‌స్టేషన్లకు శంకుస్థాపన చేశామని, వాటి నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. అంతేకాకుండా ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తొలి సంవత్సరంలోనే 500 ట్రాన్స్‌ఫార్మర్లను దేవరకద్ర నియోజకవర్గ రైతులకు అందించామని ఎమ్మెల్యే గుర్తుచేశారు. రైతులకు విద్యుత్ పరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, విద్యుత్ శాఖ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చిరుత దాడిలో లేగదూడ మృతి




**తాడ్వాయి,ఆగస్టు18మహాప్రభ** తాడ్వాయి మండలం నందివాడ పరిధిలోని పిరుమయకుంట తండా సమీపంలో చిరుతపులి దాడిలో లేగదూడ మృతి చెందిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. తండాకు చెందిన జాదవ్ సంతోష్‌కు చెందిన సుమారు రూ.35 వేల విలువైన లేగదూడను చిరుత హతమార్చినట్లు స్థానికులు తెలిపారు. గత రెండు రోజులుగా లేగదూడ కనిపించకపోవడంతో సంతోష్ కుటుంబ సభ్యులు అటవీ ప్రాంతంతో పాటు తండా శివారు ప్రాంతాల్లో వెతికారు. అయినప్పటికీ దూడ ఆచూకీ లభించలేదు. మంగళవారం మేకల కాపరులు సమాచారం అందించడంతో కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి పరిశీలించగా లేగదూడ మృతి చెంది కనిపించింది. చిరుత దాడి చేసిన ఆనవాళ్లు ఉండటంతో అదే కారణంగా దూడ మృతి చెందినట్లు నిర్ధారించారు. చిరుత సంచారంతో తండా పరిసర ప్రాంతాల ప్రజలు, రైతులు, పశువుల కాపరులు భయాందోళనకు గురవుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి చిరుత సంచారాన్ని గుర్తించి, పశువులను రక్షించేందుకు తగిన చర్యలు చేపట్టాలని తండావాసులు కోరుతున్నారు.

# ఘనంగా పాపన్న జయంతి



**పాపన్నపేట, ఆగస్టు 18 ( మహా ప్రభ )** సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 376 వ జయంతి వేడుక మంగళవారం పాపన్నపేట మండల వ్యాప్తంగా జరిగింది.కొత్తపల్లిలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి, బడుగు బలహీన వర్గాల కోసం అయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈసందర్భంగా కొత్తపల్లి గౌడ సంఘం గ్రామాధ్యక్షుడు యాదగౌడ్,సభ్యులు నారగౌడ్,దుర్గా గౌడ్,సంతోష్ గౌడ్,కిష్టగౌడ్, సత్యనారాయణ, బాలాగౌడ్,ప్రవీణ్ గౌడ్,ప్రశాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నార్సింగిలో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు



**పాపన్నపేట, ఆగస్టు 18( మహా ప్రభ )** పాపన్నపేట మండలం, నార్సింగి గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పాపన్న గౌడ్ విగ్రహానికి పాపన్నపేట సబ్ ఇన్‌స్పెక్టర్ (SI) శ్రీనివాస్ గౌడ్, గౌడ సంఘం నాయకులు మరియు గ్రామ పెద్దలు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. మొఘలాయిల అణచివేతకు వ్యతిరేకంగా, బహుజనుల హక్కుల కోసం పోరాడిన వీరుడు సర్వాయి పాపన్న గౌడ్ అని, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని ఈ సందర్భంగా పలువురు కొనియాడారు.
ఈ కార్యక్రమంలో గౌడ సంఘం ప్రతినిధులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రతి కార్మికుడికి రూ.39,373 అవసరాల ఆధారిత కనీస వేతనం ఇవ్వాలి

- టీయూసీఐ జిల్లా కార్యదర్శి సాంబశివుడు



**దేవరకద్ర, ఆగస్టు 18 (మహాప్రభ)** ప్రతి కార్మికుడికి అవసరాల ఆధారంగా నిర్దేశించిన రూ.39,373 కనీస వేతనాన్ని చట్టబద్ధంగా అమలు చేసి అందేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) జిల్లా కార్యదర్శి సాంబశివుడు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కనీస వేతనాల సమస్య దేశంలోని ప్రతి కార్మికుడి జీవితాన్ని ప్రత్యక్షంగా ప్రభావితం చేస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నోటిఫికేషన్ల ద్వారా ప్రకటిస్తున్న కనీస వేతనాలు కార్మికులు, వారి కుటుంబాల వాస్తవ అవసరాలకు అనుగుణంగా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. శాస్త్రీయంగా నిర్ణయించాల్సిన అవసరాల ఆధారిత కనీస వేతనం కంటే ప్రస్తుత చట్టబద్ధమైన వేతనాలు చాలా తక్కువగా ఉండటంతో లక్షలాది మంది కార్మికులు పేదరికంలోనే జీవించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్మికుడికి అందే వేతనం కేవలం జీవనాన్ని కొనసాగించేందుకు సరిపడే స్థాయిలో కాకుండా, అతని కుటుంబ ఆరోగ్యం, పోషణ, పిల్లల విద్య, పని సామర్థ్యం, నైపుణ్యం, గౌరవప్రదమైన జీవనం కొనసాగించే విధంగా ఉండాలని సాంబశివుడు స్పష్టం చేశారు. చట్టబద్ధమైన కనీస వేతనం అంటే పేదరిక వేతనం కాదు.. కార్మికుడి కుటుంబం గౌరవంగా జీవించేందుకు అవసరమైన వేతనం కావాలి అని ఆయన అన్నారు. అవసరాల ఆధారిత కనీస వేతనం రూ.39,373గా అమలు చేయాలన్న డిమాండ్‌ను ప్రతి ఫ్యాక్టరీ, సంస్థ, పని ప్రదేశంలోని కార్మికులు బలంగా వినిపించాలని పిలుపునిచ్చారు. కార్మికుల హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని, ఈ డిమాండ్ సాధించే వరకు పోరాటాన్ని కొనసాగించాలని ఆయన అన్నారు. ఆగస్టు 20న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న కార్మికుల ఆందోళన కార్యక్రమాల్లో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని టీయూసీఐ జిల్లా కార్యదర్శి సాంబశివుడు కోరారు.

# బిజినెస్

## భారీగా నష్టపోయిన స్టాక్ మార్కెట్..
# సెన్సెక్స్ 492 పాయింట్లు పతనం

భారత స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీగా పతనమయ్యాయి. బీఎస్ఈ సెన్సెక్స్ ఏకంగా 492 పాయింట్లు పతనం కాగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 132 పాయింట్లు నష్టపోయింది. ఉదయం బీఎస్ఈ సెన్సెక్స్ 77,418.97 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. రోజులో 77,575.21 పాయింట్ల గరిష్ట స్థాయికి, 77,234.36 పాయింట్ల కనిష్ట స్థాయికి చేరింది. చివరకు 492.70 పాయింట్ల (0.63 %) నష్టంతో 77,235.46 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 కూడా 132.75 పాయింట్లు (0.55%) నష్టపోయి 24,154.90 వద్ద ముగిసింది. బీఎస్ఈ సెన్సెక్స్ వరుసగా గత ఐదు సెషన్లు నష్టపోగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ వరుసగా ఆరు సెషన్ల నుంచి నష్టాలు పొందుతోంది. బీఎస్ఈ సెన్సెక్స్‌లో యాక్సిస్ బ్యాంక్ అత్యధికంగా 0.89% లాభపడింది. పవర్ గ్రిడ్ 0.66%, ఎంఅండ్ఎం అడ్వాన్సుడ్ 0.47%, బజాజ్ ఫైనాన్స్ 0.27%, లార్సెన్ అండ్ టర్బో 0.15%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 0.88% లాభపడ్డాయి. బజాజ్ ఫిన్‌సర్వ్, ఎన్టీపీసీ షేర్లు కూడా లాభాల్లోనే ముగిశాయి. మరోవైపు ఏసియన్ పెయింట్స్ అత్యధికంగా 2.40% నష్టపోగా, హెచ్‌సీఎల్ టెక్ సంస్థ 1.93%, భారతీ ఎయిర్‌టెల్ 1.75%, ఇన్ఫోసిస్ 2.02%, టీసీఎస్ 1.47%, హిందుస్తాన్ యునీలివర్ 1.41% నష్టపోయాయి. అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 91 డాలర్లుగా ఉంది. అలాగే, డబ్ల్యూటీఐ క్రూడాయిల్ బ్యారెల్ ధర 84.99 డాలర్లుగా ఉంది.



బ్రెంట్ క్రూడాయిల్ ధర 9 % పెరిగింది. రూపాయి విలువ స్వల్పంగా తగ్గి ఫ్లాట్‌గా ముగిసింది. డాలర్‌తో 7 పైసలు తగ్గిన రూపాయి 95.68 వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,394.72 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ఐటీ, రియాల్టీ, బ్యాంక్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి గురికావడం, పశ్చిమాసియా యుద్ధం కారణంగా నెలకొన్ని అంతర్జాతీయ పరిణామాలు, చమురు ధరల పెరుగదల వంటివి మార్కెట్ పతనానికి కారణాలుగా విశ్లేషకులు చెబుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్లు మిశ్రమంగా ముగిశాయి. జపాన్ నిక్కీ 2.5 శాతం నష్టాలు పొందగా, దక్షిణ కొరియా కోస్పి లాభాల్లో ముగిసింది. యురోపియన్ మార్కెట్లు నష్టాల్లోనే కొనసాగుతున్నాయి.

## పెరగనున్న కోల్‌గేట్-పామోలివ్ ధరలు!




పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల కారణంగా ముడిసరుకుల ధరలు పెరిగిన నేపథ్యంలో తమ ప్రొడక్టుల రేట్లు పెరిగే అవకాశం ఉందని కోల్‌గేట్-పామోలివ్ సిగ్నల్ ఇచ్చింది. ఇన్‌ఫ్లేషన్ ఆందోళన కలిగిస్తోందని, మార్జిన్లు కాపాడుకోవాల్సి ఉందని పేర్కొంది. ద్రవ్యోల్బణం ఇప్పటికీ ప్రధాన సమస్యగా మారినప్పటికీ, సాధారణ వినియోగదారులపై పడే భారాన్ని తగ్గించేందుకు కంపెనీ తగిన జాగ్రత్తలు తీసుకుంటోందని స్పష్టమవుతోంది. గతేడాది జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలను చిన్న ప్యాకెట్ల పరిమాణం పెంచడం ద్వారా వినియోగదారులకు అందించామని, ఆ అదనపు పరిమాణాన్ని రూ.10, రూ.20 ప్యాకెట్లలో ఇప్పటికీ కొనసాగిస్తున్నామని కంపెనీ సీఈఓ ప్రభా నరసింహన్ తెలిపారు.

## స్వల్పంగా పెరిగిన బంగారం ధరలు




హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో బంగారం ధరలు మంగళవారం స్వల్పంగా పెరిగాయి. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.230 పెరిగి రూ.1,55,890కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.200 ఎగిసి రూ.1,42,900 పలుకుతోంది. అటు కేజీ వెండి ధర రూ.2,55,000 వద్ద కొనసాగుతోంది. తెలుగు రాష్ట్రాల్లో నగరాన్ని బట్టి వీటి ధరల్లో స్వల్ప తేడాలు ఉండొచ్చు.

# గ్రీన్ వాహనాల జీవితకాలం మరో 5 ఏళ్లు పెంపు: కేంద్రం

**న్యూఢిల్లీ**

దేశంలో పర్యావరణహిత రవాణాను ప్రోత్సహించే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎలక్ట్రిక్, హైడ్రోజన్, సీఎన్జీ, ఎల్ఎన్జీ వంటి స్వచ్ఛమైన ఇంధనాలతో నడిచే కమర్షియల్ వాహనాల వయస్సు పరిమితిని మరో ఐదేళ్లు పెంచాలని నిర్ణయించింది. ఈ మేరకు కేంద్రం ఆగస్టు 10న ముసాయిదా నిబంధనలను విడుదల చేసింది. ప్రస్తుతం నేషనల్ పర్మిట్ వ్యవస్థలో కొన్ని కమర్షియల్ వాహనాలకు ఉన్న గరిష్ఠ వయస్సు పరిమితిని 12, 15 ఏళ్ల నుంచి 17, 20 ఏళ్లకు పెంచే ప్రతిపాదనను కేంద్రం తీసుకొచ్చింది. ఈ మార్పులతో గ్రీన్ ఎనర్జీ వాహనాలను ఎక్కువ కాలం వినియోగించుకునే అవకాశం వాహన యజమానులకు లభించనుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం దేశంలో క్లీన్ మొబిలిటీని మరింత వేగంగా విస్తరించేందుకు ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగాన్ని పెంచడం కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ముఖ్యంగా వాణిజ్య రవాణా రంగంలో ఎలక్ట్రిక్, హైడ్రోజన్, సీఎన్జీ, ఎల్ఎన్జీ వాహనాల వినియోగం పెరిగితే ఇంధన దిగుమతులపై ఆధారపడటం కూడా కొంత మేర తగ్గే అవకాశం ఉంది. అదేవిధంగా గ్రీన్ వాహనాల రిజిస్ట్రేషన్, నేషనల్ పర్మిట్ ప్రక్రియలను



మరింత సరళతరం చేయడానికి కూడా ముసాయిదా నిబంధనల్లో మార్పులు ప్రతిపాదించారు. వాహన యజమానులకు పరిపాలనా ప్రక్రియలు సులభంగా మారడంతో పాటు, స్వచ్ఛమైన ఇంధన వాహనాల కొనుగోలు, వినియోగంపై ఆసక్తి పెరుగుతుందని కేంద్రం భావిస్తోంది. ఈ నిబంధనలు అమల్లోకి వస్తే గ్రీన్ కమర్షియల్ వాహనాలకు సంబంధించి వాహన యజమానులు, రవాణా సంస్థలకు దీర్ఘకాలిక ప్రయోజనం కలగనుంది. పర్యావరణ పరిరక్షణతో పాటు దేశంలో స్థిరమైన, శుభ్రమైన రవాణా వ్యవస్థను అభివృద్ధి చేయడంలో ఈ నిర్ణయం కీలక అడుగుగా నిలవనుంది.

## బంగ్లాదేశ్ చేతిలో ఓటమి ఎఫెక్ట్..
# దెబ్బకు ఓపెనర్‌ను మార్చేసిన ఆస్ట్రేలియా..!

-బంగ్లాదేశ్ చేతిలో ఓటమితో ఆసీస్ జట్టు మార్పులు
--ఓపెనర్ వెదరాల్డ్ ఔట్, మ్యాట్ రెన్‌షా ఇన్
--ఆగస్టు 22 నుంచి ఆసీస్, బంగ్లాదేశ్ మూడో టెస్టు

డార్విన్‌లో బంగ్లాదేశ్ చేతిలో ఎదురైన ఘోర పరాభవం ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డును ఇరకాటంలో పెట్టింది. పదే పదే విఫలమవుతున్నా.. కొందరికి ఎందుకు అవకాశాలు ఇస్తున్నారనే ప్రశ్నలు తలెత్తాయి. దీంతో రెండో టెస్టుకు ముందు క్రికెట్ ఆస్ట్రేలియా తమ జట్టులో మార్పులు చేసింది. ఆగస్టు 22 నుంచి మెకేలోని గ్రేట్ బారియర్ రీఫ్ అరేనాలో జరగబోయే రెండో, నిర్ణయాత్మక టెస్ట్ కోసం ఆసీస్ యాజమాన్యం తమ టాప్ ఆర్డర్‌లో కీలక మార్పు చేసింది. ఫ్లాప్ ఫామ్‌తో తీవ్రంగా నిరాశపరిచిన ఓపెనర్ జేక్ వెదరాల్డ్‌ను జట్టు నుంచి తప్పించింది. అతడి స్థానంలో మ్యాట్ రెన్‌షాను రీకాల్ చేస్తూ 13 మంది సభ్యుల స్క్వాడ్‌ను ప్రకటించింది.

గత ఏప్రిల్‌లోనే జాతీయ కాంట్రాక్ట్ దక్కించుకున్న వెదరాల్డ్, డార్విన్ టెస్ట్ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ కేవలం



23, 0 పరుగులు మాత్రమే చేసి విఫలమయ్యాడు. ఇప్పటి వరకు 12 టెస్ట్ ఇన్నింగ్స్‌లలో అతడి సగటు కేవలం 20.36 మాత్రమే కావడం గమనార్హం. యాషెస్ సిరీస్‌లో ఆకట్టుకున్నప్పటికీ, అంతర్జాతీయ స్థాయిలో బౌలర్ల ఒత్తిడిని వెదరాల్డ్ తట్టుకోలేకపోయాడని హెడ్ కోచ్ ఆండ్రూ మెక్‌డొనాల్డ్ పరోక్షంగా అంగీకరించాడు. దీంతో వెదరాల్డ్‌తో పోలిస్తే షెఫీల్డ్ షీల్డ్ టోర్నీలో నిలకడగా రాణించిన మ్యాట్ రెన్‌షా మెకే పిచ్‌పై సరైన ప్రత్యామ్నాయమని సెలెక్టర్లు భావించారు. మరోవైపు నంబర్ 3 బ్యాటర్ మార్నస్ లాబుషేన్ ఫామ్ కూడా జట్టును కలవరపెడుతోంది. గత నాలుగేళ్లుగా దాదాపు 42 టెస్ట్ ఇన్నింగ్స్‌ల్లో అతడి సగటు 25.23 మాత్రమే. దాదాపు మూడేళ్లుగా అతడు ఒక్క సెంచరీ కూడా చేయలేదు. డార్విన్ టెస్టులోనూ 1, 31 పరుగులు మాత్రమే చేశాడు. ఈ మ్యాచులోనూ విఫలమైతే.. అతడు జట్టులో చోటు కోల్పోయే ప్రమాదం ఉంది. వెదరాల్డ్ జట్టులో చోటు కోల్పోవడంతో మెకే టెస్టులో ట్రావిస్ హెడ్‌తో కలిసి మ్యాట్ రెన్‌షా ఇన్నింగ్స్ ప్రారంభించే అవకాశం ఉంది. రెన్‌షాకు 14 టెస్టులాడిన అనుభవం ఉండటం, మెకే మైదానంలో ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో రెండు శతకాలు బాదిన రికార్డు ఉండటం ఆసీస్‌కు కలిసివచ్చే అంశం. మిడిల్ ఆర్డర్ ఆప్షన్‌గా జోష్ ఇంగ్లిస్ కూడా స్క్వాడ్‌లో ఉన్నప్పటికీ, స్పెషలిస్ట్ ఓపెనర్‌గా రెన్‌షాకే తుది జట్టులో చోటు దక్కే అవకాశం ఉంది.

## టెస్టుల్లో 100 సిక్సర్లు..
# రిషబ్ పంత్ రికార్డు

**గాలే:**

రిషబ్ పంత్ తన ఖాతాలో అరుదైన రికార్డును వేసుకున్నాడు. టెస్టుల్లో వంద సిక్సర్లు బాదిన భారత బ్యాటర్‌గా నిలిచాడు. శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో వికెట్‌కీపర్, బ్యాటర్ రిషబ్ పంత్ హాఫ్ సెంచరీతో చెలరేగాడు. కేవలం 89 ఇన్నింగ్స్‌లోనే వంద సిక్సర్లు బాదాడు పంత్. డీప్ ఫైన్ లెగ్‌లో స్వీప్ షాట్ సిక్సర్‌తో ఈ మ్యాచ్‌లో పంత్ హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. రెండో ఇన్నింగ్స్‌లో 66 రన్స్ చేసి అతను ఔటయ్యాడు. ఈ ఇన్నింగ్స్‌లో పంత్ రెండు సిక్సర్లు బాదాడు. టెస్టుల్లో ఫాస్టెస్ట్ 100 సిక్సర్లు కొట్టిన బ్యాటర్‌గా ఘనత సాధించాడు. 4918 బంతుల్లో పంత్ వంద సిక్సులు బాదాడు. గతంలో ఆడమ్ గిల్‌క్రిస్ట్ పేరిట ఆ రికార్డు ఉన్నది. 6,578 బంతుల్లో గిల్‌క్రిస్ట్ ఆ రికార్డు క్రియేట్ చేశాడు. టెస్టుల్లో అత్యధిక సిక్సర్లు కొట్టిన వారిలో బెన్ స్టోక్స్ ముందున్నాడు. అతను 138 సిక్సర్లు బాదాడు. ఆ తర్వాత బ్రెండన్ మెకల్లమ్ రెండో స్థానంలో ఉన్నాడు. అతను 107 సిక్సర్లు కొట్టాడు. ఫాస్టెస్ట్ మైలురాయి అందుకున్న ప్లేయర్లలో పంత్ ఫస్ట్ నిలిచాడు. స్టోక్స్ కన్నా 31 మ్యాచులు తక్కువే ఆడాడు పంత్. 2025 తర్వాత సిక్సర్లు కొట్టే సామర్థ్యాన్ని పంత్ పెంచాడు. గడిచిన 16 ఇన్నింగ్స్‌లో అతను 32 సిక్సర్లు బాదాడు. కేవలం 2025లోనే అతను 26 సిక్సర్లు కొట్టాడు. వంద సిక్సర్లలో 76 సిక్సర్లు కేవలం స్పిన్ బౌలింగ్‌లోనే బాదాడు పంత్. మరో వైపు భారత్ తన రెండో ఇన్నింగ్స్‌లో తాజా సమాచారం ప్రకారం 47 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 190 రన్స్ చేసింది. భారత్ ఆధిక్యం 350 రన్స్ దాటింది.



# స్పోర్ట్స్

# హాకీ వరల్డ్‌కప్‌లో గోల్స్ వర్షం..

- చరిత్రాత్మక విజయంతో భారత్‌కు అగ్రస్థానం..!



ఎఫ్ఐహెచ్ మహిళల హాకీ వరల్డ్‌కప్‌లో భారత జట్టు రికార్డు విజయం నమోదు చేసింది. ఆరంభ పోరులో చైనాకు ముచ్చెమటలు పట్టించిన టీమిండియా.. రెండో మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాను చిత్తుగా ఓడించింది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో గోల్స్ వర్షం కురిపించి 6-1తో భారీ విక్టరీ కొట్టింది. తద్వారా వరల్డ్‌కప్ చరిత్రలోనే అతిపెద్ద విజయంతో గ్రూప్ డీ నుంచి అగ్రస్థానంలో నిలిచింది టీమిండియా. నెదర్లాండ్స్ వేదికగా జరుగుతున్న మహిళల హాకీ వరల్డ్‌కప్‌లో టీమిండియా దుమ్మురేపింది. మొదటి మ్యాచ్‌లో చేజారిన విజయాన్ని.. ఒడిసిపడుతూ దక్షిణాఫ్రికాను మట్టికరిపించారు భారత అమ్మాయిలు. గ్రూప్ డీ లీగ్ రెండో పోరులో సఫారీలను కంగుతినిపిస్తూ 6--1తో జయభేరి మోగించింది ఆరెంజ్ ఆర్మీ. ఈ మెగా టోర్నీ చరిత్రలో మొన్నటివరకూ 1974లో స్పెయిన్‌పై 4-1 విజయమే భారత్‌కు అత్యుత్తమంగా ఉండేది. కానీ, ఇప్పుడు అది రెండో స్థానానికి పడిపోయింది. ఆట మొదలు నుంచి దూకుడు కనబరిచిన భారత అమ్మాయిలు ప్రత్యర్థి గోల్ పోస్ట్‌పై దండయాత్ర చేశారు. సునేలితా టొప్పో, నవ్నీత్ కౌర్, సుశీలా చాను, లల్రేమిసియామి, సాక్షి రానాలు తలా ఒక గోల్ కొట్టారు. ఈ విజయంతో 4 పాయింట్లు సాధించిన టీమిండియా అగ్రస్థానం దక్కించుకుంది. మరో మ్యాచ్‌లో చైనా ఇంగ్లండ్‌ను ఓడించింది. ఇక చివరి గ్రూప్ మ్యాచ్‌లో భారత జట్టు ఆగస్టు 20, గురువారం నాడు ఇంగ్లండ్‌ను ఢీకొట్టనుంది. మరొక్క పాయింట్ సాధిస్తే చాలు రెండో రౌండ్ ఆడడం ఖాయం.

# సీఎం విజయ్ తనయుడి 'సిగ్మా' రిలీజ్ డేట్ ఫిక్స్..

## గాంధీ జయంతిన రాబోతున్న సందీప్ కిషన్!




కోలీవుడ్ స్టార్ హీరో, తమిళనాడు సీఎం విజయ్ తనయుడు జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయమవుతున్న మోస్ట్ అంటెసిపేటెడ్ యాక్షన్ హీస్ట్ డ్రామా 'సిగ్మా'. టాలెంటెడ్ హీరో సందీప్ కిషన్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన అప్‌డేట్ ప్రస్తుతం సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ తాజాగా అధికారిక విడుదల తేదీని ప్రకటించారు. గాంధీ జయంతి కానుకగా 2026 అక్టోబర్ 2వ తేదీన ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా ఘనంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. ఈ ప్రకటనతో పాటు విడుదల చేసిన సరికొత్త పోస్టర్‌లో సందీప్ కిషన్ మునుపెన్నడూ లేని విధంగా అత్యంత ఇంటెన్స్ లుక్‌లో కనికట్టు చేస్తున్నారు. ఈ చిత్రంలో సందీప్ కిషన్ సరసన టాలెంటెడ్ బ్యూటీ ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటిస్తుండగా, నూతన దర్శకుడి ప్రతిభకు తగ్గట్టుగా భారీ తారాగణం ఈ సినిమాలో భాగమైంది. ప్రముఖ కొరియోగ్రాఫర్, నటుడు రాజు సుందరం, వర్సటైల్ యాక్టర్ సంపత్ రాజ్, శివ్ పండిట్, అన్బు దాసన్, యోగ్ జాపీ, షీలా రాజ్‌కుమార్ మరియు కిరణ్ కొండ వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సాంకేతిక నిపుణుల విషయానికి వస్తే, స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్. థమన్ ఈ సినిమాకు అదిరిపోయే సంగీతం అందిస్తుండగా, కృష్ణన్ వసంత్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు మరియు ప్రవీణ్ కేఎల్ ఎడిటింగ్ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమా విడుదల తేదీ ఖరారు కావడంతో, రాబోయే రోజుల్లో టీజర్, పాటలతో పాటు ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.



## కుందనపు బొమ్మలా మెరిసిన రుక్మిణి వసంత్..

# సంక్రాంతి బరిలో మెగా 158 మూవీ

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం మెగా158 నుంచి సినీ అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్ వచ్చింది.




ఈ చిత్రాన్ని సంక్రాంతి 2027 కానుకగా థియేటర్లలోకి తీసుకురావడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. అనుకున్న ప్లాన్ ప్రకారం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే దాదాపు 40 రోజుల చిత్రీకరణ విజయవంతంగా పూర్తయింది. సినిమాకు సంబంధించి ఫస్ట్ హాఫ్ ఎడిటింగ్ దాదాపు పూర్తయి లాక్ అయినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన తాజా షెడ్యూల్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా, భారీ బ్జడెట్‌తో ఈ విజువల్ స్పెక్టాకిల్‌ను నిర్మిస్తోంది. మెగాస్టార్ పుట్టినరోజైన ఆగస్ట్ 22న సినిమా నుంచి అదిరిపోయే అఫీషియల్ అప్‌డేట్ విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. బాబీ డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమా మీద భారీ అంచనాలు ఉన్నాయి. మన శంకర వరప్రసాద్ గారు లాంటి బ్లాక్ బస్టర్, వాల్తేరు వీరయ్య లాంటి కాంబో కావడంతో ఈ సినిమా మీద కూడా ముందు నుంచి అందరి ఫోకస్ ఉంది. ఇప్పటికే సంక్రాంతికి అనిల్ రావిపూడి వెంకటేష్ కళ్యాణ్ రామ్ సినిమా. రవితేజ శ్రీవిష్ణు ఎంటర్‌టైనర్, శర్వానంద్- శ్రీనువైట్ల కాంబో చిత్రం, ప్రశాంత్ వర్మ 'మహాకాళి', సాయి దుర్గా తేజ్ సంబరాల ఏటిగట్టు సినిమాలు ఉండగా ఇప్పుడు మెగాస్టార్ సినిమా కూడా అదే సీజన్ మీద కన్నేయడంతో ఏం జరగనుంది అనేది చూడాలి.



# మాజీ లవర్‌పై అనుపమ పరమేశ్వరన్ నిప్పులు

అనుపమ పరమేశ్వరన్ తన బ్రేకప్, గత రిలేషన్‌షిప్ గురించి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రేమించేటప్పుడు అంతా బానే ఉన్నా, విడిపోయిన తర్వాత నరకమేనని ఆమె పేర్కొన్నారు. గతంలో తానొక టాక్సిక్ రిలేషన్‌షిప్‌లో ఉన్నానని, ఎమోషనల్‌గా చాలా బాధపడ్డానని తెలిపారు. కొన్ని నెలలకే పెళ్లి దాకా మాటలు వచ్చినా, ఆ తర్వాతే తన మాజీ ప్రియుడి నిజ స్వరూపం బయటపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అతను తన బట్టలు, సోషల్ మీడియా పోస్టుల విషయంలో ఆంక్షలు విధించడంతో స్వేచ్ఛను పూర్తిగా కోల్పోయానని అనుపమ వివరించారు. అపరిచితుడు సినిమాలో విక్రమ్ పాత్రలాగా అతను క్షణానికొక రకంగా ప్రవర్తించేవాడని ఆమె సంచలన కామెంట్స్ చేశారు. ఈ చేదు అనుభవం వ్యక్తిగత జీవితం పైనే కాకుండా తన కెరీర్‌పైనా తీవ్ర ప్రభావం చూపిందని, డ్రాగన్ ప్రమోషన్స్‌కు కూడా వెళ్లనివ్వకుండా అడ్డుకున్నాడని అనుపమ వెల్లడించారు. ఈ బంధం ఇలాగే కొనసాగితే మనశ్శాంతి దూరమవుతుందని గ్రహించి బ్రేకప్ చెప్పానని తెలిపారు. ఈ నిర్ణయం తీసుకోవడానికి తాను మానసికంగా చాలా మధనపడ్డానని ఆమె చెప్పుకొచ్చారు. ప్రస్తుతం తన ఫోకస్ అంతా కెరీర్‌పైనే ఉందని, జీవితంలో మళ్లీ సంతోషాన్ని నింపుకునే పనిలో ఉన్నానని అనుపమ పరమేశ్వరన్ తెలిపారు. అయితే, తన మాజీ ప్రియుడి పేరును ఆమె బయటపెట్టలేదు.

# డిసి చిత్రంపై అల్లు అర్జున్ ప్రశంసలు




తమిళ చిత్ర పరిశ్రమలో సంచలనం సృష్టిస్తున్న 'డీసీ' చిత్రంపై టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రశంసలు కురిపించారు. ఇప్పటికే రూ. 85 కోట్ల వసూళ్లను సాధించి, రూ. 100 కోట్ల క్లబ్ దిశగా దూసుకెళ్తున్న ఈ సినిమాపై ఆయన సోషల్ మీడియా వేదికగా తన అభిప్రాయాలను పంచుకున్నారు. 'ఈ సినిమా ఒక అద్భుతమైన తమిళ క్లాసిక్ అని, సినిమాను ప్రేమించే ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా చూడాల్సిన చిత్రమని ఆయన కొనియాడారు. ఈ చిత్రాన్ని అర్థం చేసుకోగలిగే వారికి ఇది ఒక కవితలా ఉంటుందని' బన్నీ అభివర్ణించారు. ఇక దర్శకుడు అరుణ్ మాథేశ్వరన్ మేకింగ్ స్టైల్‌కు తాను ఫిదా అయ్యానని తెలుపుతూ, చిత్ర బృందం మొత్తానికి ఆయన అభినందనలు తెలియజేశారు. ముఖ్యంగా ఈ సినిమాకు ప్రాణం పోసిన సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ పనితీరును అబ్సల్యూట్ మాస్టర్ బూస్టర్‌గా బన్నీ అభివర్ణించారు. సాంకేతికంగా కూడా ఈ చిత్రం అత్యున్నత ప్రమాణాలతో తెరకెక్కిందని ఆయన పేర్కొన్నారు. నటీనటుల విషయానికి వస్తే, వామికా గబ్బి నటన అద్భుతమని మెచ్చుకుంటూనే, ప్రధాన పాత్రలో హీరోగా నటించిన దర్శకుడు లోకేష్ కనగరాజ్ నటనను కూడా ప్రత్యేకంగా ప్రశంసించారు. తన మిత్రుడు లోకేష్ కనగరాజ్ తనకు ఎల్లప్పుడూ ఒక గొప్ప మద్దతుగా ఉంటారని అల్లు అర్జున్ సంతోషం వ్యక్తం చేశారు. విడుదలైన కొద్ది కాలంలోనే బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను రాబడుతూ, సినీ వర్గాల్లో 'డీసీ' మూవీ హాట్ టాపిక్‌గా మారింది.

# నాన్‌స్టాప్‌గా 'రాపో23'



హీరో రామ్ పోతినేని స్వీయ దర్శకత్వంలో నటిస్తున్న తాజా చిత్రం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్నది. 'రాపో23' వర్కింగ్ టైటిల్‌తో సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇటీవలే పుదుచ్చేరి శివార్లలో 24 గంటల పాటు నిర్విరామంగా ఈ సినిమా షూటింగ్‌ను జరిపారు. హీరోగా, దర్శకుడిగా ఈ సినిమా కోసం రామ్ ఎంతగానో శ్రమిస్తున్నారని, ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పర్యవేక్షిస్తున్నారని యూనిట్ వర్గాలు తెలిపాయి. 'పుదుచ్చేరిలో వేసిన భారీ సెట్‌లో తొమ్మిది రోజుల పాటు షూటింగ్ జరిపాం. ఇటీవల వర్షాల కారణంగా షెడ్యూల్‌కు బ్రేక్‌పడింది. త్వరలో మళ్లీ షూటింగ్‌ను మొదలుపెడతాం' అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: సామ్ సీఎస్, నిర్మాత:కృష్ణ పోతినేని.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com